ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -320 | పేజీలు - 8 వెల - 03/- | శనివారం 7 మార్చి 2026


# 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్




**సోషల్ మీడియాతో పిల్లలు నష్టపోవడానికి వీల్లేదు అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం**

## స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్

- 25 నూతన పాలసీలతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 3 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం
- లడ్డూ కల్తీ జరిగినా ఇంకా క్షమాపణలు చెప్పరా
- అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు



అమరావతి,**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్))** రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవద్దనే సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నారు. స్వప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని , దానికి బానిసై చెడుకు ఉపయోగిస్తే 2లో...



# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

- వైసిపి వల్ల 30 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రం
- ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ. 3.32లక్షల కోట్ల బడ్జెట్
- పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- వైసిపి విద్యుత్ కొనుగోళ్ళతో రూ.12,250కోట్ల నష్టం
- విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్లు నష్టం
- రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగం
- రాష్ట్రాన్ని నిలబెట్టాలనే కూటమి కోసం పాటుపడ్డా
- ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

అమరావతి,**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ అసెబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల**మిగతాది** 2లో...

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ దూకుడు...

# రూ.441.63 కోట్ల ఆస్తులు అటాచ్



అమరావతి,**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితులుగా ఉన్న కెసిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, ఇతర నిందితులకు చెందిన రూ.441.63 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేస్తున్నట్లు శుక్రవారం ఈడీ అధికారికంగా ప్రకటించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈ ఆస్తులను జప్తు చేశారు. ఈడీ తెలిపిన వివరాల ప్రకారం.. జప్తు చేసిన ఆస్తుల్లో కెసిరెడ్డి రాజశేఖర రెడ్డి, బూనేటి చాణక్య, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులకు చెందిన బ్యాంక్ బ్యాలెన్సులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. **మిగతాది** 2లో...

# అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం



## ఇద్దరు పైలట్లు దుర్మరణం ఒకరు ఆపరేషన్ సిందూర్ పైలట్ పూర్వేశ్ దురాగ్కర్

**న్యూఢిల్లీ,మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ జెట్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని పూర్వేష్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు**మిగతాది** 2లో...

# కూటమిది ఫ్యామిలీ బడ్జెట్

- అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చే యత్నం
- ఉచిత సిలిండర్లతో మహిళలపై భారం తగ్గించాం
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం
- సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశాం
- మండలిలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్




అమరావతి,**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. 'ఫ్యామిలీ బడ్జెట్' అని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బడ్జెట్‌పై చర్చలో ఇతర విషయాలు రావడం బాధాకరమన్నారు. శాసనమండలిలో**మిగతా** 2లో...

# వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దుతగా నిలిచా

## మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,,మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. **మిగతాది** 2లో...




# యూపీఎస్సీ సివిల్స్ 2025 తుది ఫలితాల విడుదల

## వివిధ కేంద్ర సర్వీసులకు 958 మంది ఎంపిక

- ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచిన అనుజ్ అగ్నిహోత్రి
- సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు
- 23వ ర్యాంకు సాధించిన జశ్వంత్ చంద్ర



**న్యూఢిల్లీ,మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025 తుది ఫలితాలు ఇవాళ విడుదలయ్యాయి. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా వివిధ కేంద్ర సర్వీసుల కోసం మొత్తం 958 మంది అభ్యర్థులను యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఈ ఫలితాల్లో అనుజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి టాపర్‌గా నిలవగా, రాజేశ్వరి సువే రెండో ర్యాంకు, అకన్ష్ ధుల్ మూడో ర్యాంకును కైవసం చేసుకున్నారు. **మిగతాది** 2లో...

## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు

# మరో మార్గం లేదు

- ఇరాన్ బేషరతుగా లొంగిపోతేనే ఒప్పందం ఉంటుందన్న ట్రంప్
- యుద్ధం ముగిశాక ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ
- ట్రంప్ సరికొత్త నినాదం.. 'మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్'

**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం జరగాలన్నా, ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ చేశారు. "ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలి! ఆ తర్వాత అక్కడ గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకత్వం రావాలి. అప్పుడే మేము, మా మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను వినాశనం అంచుల నుంచి బయటకు తీసుకొస్తాం. ఇరాన్‌ను ఆర్థికంగా మునుపటి కంటే బలంగా తీర్చిదిద్దుతాం. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా తన ఎన్నికల నినాదాన్ని గుర్తుచేస్తూ.. "మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్" అంటూ కొత్త నినాదాన్ని వినిపించారు.
**మిగతాది** 2లో...



# వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దతుగా నిలిచా

(మొదటి పేజి తరువాయి)

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన



స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు.ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని తెలంగాణ సీఎం తెలిపారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు తెలియవా?.. వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు కాచుకోవాలా?.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలుతారా? అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ సివిల్స్ 2025 తుది ఫలితాల విడుదల

(మొదటి పేజి తరువాయి)



ఈసారి ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన అభ్యర్థులు తమ సత్తా చాటారు. దాదాపు 30 మందికి పైగా తెలుగు అభ్యర్థులు సివిల్స్‌లో విజయకేతనం ఎగురవేయడం విశేషం. ముఖ్యంగా ఆల్ ఇండియా 23వ ర్యాంకుతో జీను శ్రీ జస్వంత్ చంద్ర, 55వ ర్యాంకుతో గుడెల్లి సృజన (పెద్దపల్లి జిల్లా) ఉభయ తెలుగు రాష్ట్రాల్లో టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. వీరిద్దరూ ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతుండటం గమనార్హం.

ఇక ఇతర తెలుగు అభ్యర్థుల్లో పోలవరపు ధ్వనీష్ (108), అట్ల తరుణ్ తేజ (123), శ్రీగిరిరాజు వి.పి.ఎస్. సాయి కృష్ణ (125), కొలిపాక శ్రీకృష్ణ సాయి (150), బానోత్ లక్ష్మి రచన (178), ఎస్. వర్షిత్ రెడ్డి (259), మాసమ్మగారి పవన్ కుమార్ రెడ్డి (297) మంచి ర్యాంకులు సాధించారు. అలాగే వెలిమినేటి విక్రమ్ సింహా రెడ్డి (541), గుమ్మల శ్వేత (573), వెలిమినేటి విజయసింహా రెడ్డి (682), పుడారి రాహుల్ (748), కత్తిమాని అనిరుధ్ (786), కొరపోతుల శ్రీకర్ రాజు (806), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823), కట్టా ప్రత్యూష (908), రాజశేఖర్ గోగుల (920), గుగోలత్ జితేందర్ నాయక్ (939) కూడా విజేతల జాబితాలో నిలిచారు. లక్షలాది మంది పోటీపడే ఈ పరీక్షలో తెలుగు యువత ఈ స్థాయి విజయాలు సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పూర్తి ఫలితాల జాబితాను బజూంఎ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

# అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

(మొదటి పేజి తరువాయి)

. పూర్వేష్(28).. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఈ విషయం తమకు తెలియదని.. ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తరువాత తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. యుద్ధ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని.. యుద్ధం ముగిసిన తరువాత పూర్వేష్ తమకు కాల్ చేసి విషయం చెప్పాడని రవీంద్ర తెలిపారు. అస్సాంలో ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు తన కొడుకుతో మాట్లాడినట్లు రవీంద్ర తెలిపారు. ఇంతలోనే ఇలా జరిగిందంటూ కన్నీరమున్నీరయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉందన్నారు. పూర్వేష్ ఎప్పుడు మాట్లాడినా యుద్ధ విమానాలను నడిపిన తన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్‌ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని.. తన సహోద్యోగులను ఎంతో గౌరవించేవాడని రవీంద్ర తెలిపారు. 'నా కొడుకు దేశ సేవలో తనను తాను త్యాగం చేసుకున్నాడు. పూర్వేష్ తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, తను కోరుకున్నంతగా దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు. తిరిగి విధుల్లోకి చేరిన తరువాత ఇలా జరిగింది.' అంటూ రవీంద్ర విలపించారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ శిక్షణా మిషన్‌లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్‌తో కమ్యూనికేషన్ కోల్పోయినట్లు తెలిపిన అధికారులు.. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో కూలిపోయినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కర్ ఈ తోయిబాలో భాగమైన రెసిస్టెన్స్ ఫ్రంట్ ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారతదేశం మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే భారత భద్రతా దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ తరువాత పాకిస్థాన్.. భారత్‌పై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులకు తెగబడగా.. భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ప్రతిదాడులతో పాక్‌ను షేక్ చేశాయి. మే 10వ తేదీన ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించారు. దాంతో ఆపరేషన్ సిందూర్ నిలిచిపోయింది.

## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు
# మరో మార్గం లేదు

(మొదటి పేజి తరువాయి)

మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. క్షిపణి దాడులు, నావికాదళ దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై దాడులు విస్తృతం చేయగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడుతోంది.

కొన్ని రోజుల కిందట హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి ముంచేయడం ఉద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో వెయ్యి మందికి పైగా మరణించగా, ఇజ్రాయెల్, లెబనాన్‌లలో డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురుస్తుండటంతో వేలాది మంది రాజధానిని వదిలి పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది.ఇదిలా ఉండగా, ట్రంప్ యుద్ధ అధికారాలను నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలను వాషింగ్టన్‌లో సెనేట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రస్తుతానికి అమెరికా బలగాలు నేరుగా రంగంలోకి దిగకపోయినా, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వైట్‌హౌస్ కొట్టిపారేయలేదు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడుతోంది. హార్మూజ్ జలసంధిలో దాడుల భయంతో నౌకల రాకపోకలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు షిప్పింగ్ సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి.

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ దూకుడు... రూ.441.63 కోట్ల ఆస్తులు అటాచ్

(మొదటి పేజి తరువాయి)

ఏపీలో 2019కి ముందు మద్యం వ్యాపారం పారదర్శకంగా, డిజిటల్ ట్రాకింగ్‌తో జరిగేదని, అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం కావాలనే ఆటోమేటెడ్ విధానాన్ని రద్దు చేసి మాన్యువల్ విధానాన్ని తీసుకొచ్చిందని ఈడీ పేర్కొంది. ఈ కొత్త విధానం ద్వారా అధికారులకు విచక్షణాధికారాలు కట్టబెట్టి, తమకు నచ్చిన బ్రాండ్లకు అనుకూలంగా వ్యవహరించారని దర్యాప్తులో తేలింది.

ఆర్డర్లు ఇవ్వాలంటే 15 నుంచి 20 శాతం ముడుపులు ఇవ్వాలని డిస్టిలరీలను సిండికేట్ సభ్యులు డిమాండ్ చేశారని, నిరాకరించిన వారి చెల్లింపులు నిలిపివేశారని ఈడీ ఆరోపించింది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.3,500 నుంచి రూ.4,000 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేసింది. వసూలు చేసిన ముడుపులను హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో దాచిపెట్టి, అక్కడి నుంచి తరలించినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో కీలక నిందితులు 'సిగ్నల్' వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా సంభాషణలు జరిపారని, దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ఈడీ స్పష్టం చేసింది.

## కూటమిది ఫ్యామిలీ బడ్జెట్

(మొదటి పేజి తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. ద్రవ్యవినిమయ బిల్లుపై మాట్లాడారు. మహిళలకు ఉచిత సిలిండర్లు ఇచ్చి ఆర్థిక భారం తగ్గించామని అన్నారు. మహిళల సమస్యలు తెలుసు కాబట్టే.. ఉచిత బస్సు సదుపాయం కల్పించామన్నారు. సామాన్యుడికి మేలు చేసేందుకే అన్న క్యాంటీన్లు పెట్టినట్లు వివరించారు. ప్రజా ప్రతినిధులుగా మనం ఏం చేశామన్నదే కీలకం. మనం చేసిన పనులు మాత్రమే చరిత్రలో ఉంటాయి. గత వైకాపా ప్రభుత్వం 153 లక్షల టన్నుల చెత్తను వదిలిపెట్టి వెళ్లింది. ప్రస్తుతం ఆ చెత్తను కూడా తొలగించాల్సి వస్తోంది.బడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. అప్పులు చేయడం తప్పు అని నేనెప్పుడూ చెప్పలేదు. చేసిన అప్పులను ఎలా ఉపయోగిస్తామనేది కీలకం. రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షనేతలు ఆరోపణలు చేయవద్దని కోరుతున్నానని పయ్యావుల అన్నారు. అంతకుముందు కాగ్ రిపోర్టుపై ప్రతిపక్ష, పాలకపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. రెవెన్యూ, జీఎస్టీ వసూళ్లలో దేశంలో ఏపీ 22వ స్థానంలో ఉందని బొత్స అన్నారు. సున్నా వడ్డీ కింద ఎవరికీ రుణాలు ఇవ్వడం లేదని, మహిళలను లక్షాధికారులను ఎలా చేస్తారో చెప్పాలని నిలదీశారు.

# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

(మొదటి పేజి తరువాయి)

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు. ఈ సందర్భంగా 'నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని... భావితరాల కోసం' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. బడ్జెట్ లో చంద్రబాబు దూరదృష్టి, దక్షత, దార్శనికత అడుగడుగునా ఉందని కొనియాడారు. వైసీపీ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్ల కారణంగా డిస్కంలకు రూ.12,250కోట్ల నష్టం వచ్చిందని చెప్పుకొచ్చారు. కరెంట్ సరఫరాలో కూడా ఇబ్బందులు వచ్చాయని వివరించారు. రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని.. ఆ భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించామని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల మేర అప్పులు తమపై ఉంచి వెళ్లిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రూ.35వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని.. అందులో రూ.25వేల కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా రూ.7వేల కోట్లకు పైగా జత చేశామని వెల్లడించారు. గతంలో వైసీపీ రాష్ట్ర వాటా ఇవ్వకపోవటం వల్ల రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగమయ్యాయని చెప్పుకొచ్చారు. వైసీపీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వైసీపీకి 11మంది సభ్యులున్నా 11వందల మంది ఉన్నట్లుగా మాట్లాడుతారని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు చెప్పే అసత్యాలు కూడా ప్రజలు నిజాలని బలంగా నమ్మే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఇతరుల స్వేచ్ఛను, హక్కులను హరించటం తమ హక్కని వైసీపీ భావిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి అసభ్య పదజాలంతో మాట్లాడే వారిని కట్టడి చేయాలని కోరారు. దోపిడి చేసే దొంగ పోలీసులను చూసి.. దొంగే దొంగ అని అరిచినట్లుగా జగన్ అండ్ కో తీరు ఉందని సెటైర్లు గుప్పించారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు.కల్తీ వాళ్లే చేస్తారని... నిందలు మాత్రం కూటమి ప్రభుత్వంపై మోపుతారని పవన్ కల్యాణ్ ఆగ్రహించారు. ఎవరు ఎమ్మెల్యేగా గెలవాలన్నా.. అన్ని కులాల వాళ్లు ఓట్లు వేయాల్సిందేనని తెలిపారు. ఈ మధ్య కొందరు ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటున్నారని ఫైర్ అయ్యారు. ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటే రాష్ట్రం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులం దాటకపోతే ఏపీ విచ్ఛిన్నమవుతుందని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా మనమే చెప్పాలని అన్నారు. లేకపోతే ఎంత బ్జడెట్ పెట్టినా ఉపయోగం ఉండదని చెప్పుకొచ్చారు. పోలవరం, అమరావతిని వైసీపీ పక్కన పెట్టిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు.రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి నేతలందరం ఐక్యంగా ముందుకెళ్దామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కూటమి చాలా బలంగా ఉండాలనేది తన ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. ఏపీ అభివృద్ధి కోసమే 2014లో అలయన్స్ కోసం కష్టపడ్డానని తెలిపారు. 2019లో అది సాధ్యం కాలేదని.. 2024లో మరోసారి వెనక్కు తగ్గి పొత్తు పెట్టుకున్నానని ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలంటే మనలో ఏదైనా చిన్నచిన్న సమస్యలున్నా సర్దుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగంలోని మూడు వ్యవస్థలు పరస్పర సహకారంతో పని చేయాలని తెలిపారు. ఏ వ్యవస్థలో లోపాలు ఏర్పడినా ప్రజలకు సేవ చేయటంలో ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. జగన్ అండ్ కో కుట్రలను ఎదుర్కోవాలంటే మనం కలిసి ఉండాలని పవన్ కల్యాణ్ సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిధులను పారదర్శకంగా ఖర్చు చేశామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు ఎవరొచ్చినా వారు అడిగింది ఇవ్వటానికి తాను ప్రయత్నించానని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా తన శాఖల తరపున ఇచ్చిన నిధుల వివరాలు అందజేస్తున్నానని తెలిపారు. బడ్జెట్ వస్తుందంటే ప్రతి ఒక్కరూ ఎన్నో ఆశలుపెట్టుకుంటారని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 15సంవత్సరాలు ఏపీ కోసం కూటమి పని చేస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి బలంగా ఉండాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారని అన్నారు. మంత్రులు కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్ తమ శాఖల్లో బాగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. పర్యాటక రంగంలో రూ.20వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు.

# 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

(మొదటి పేజి తరువాయి)

నాశనమవుతారని అన్నారు. 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని సూచన వచ్చిందని, వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని, 13-16 ఏళ్ల లోపు వారికి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు.

రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బ్జడెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుందామన్నారు సీఎం. పల్లెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలోనూ వివిధ సంస్కరణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు ముఖ్యమంత్రి. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నిస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డేను నిర్వహించామన్నారు. యోగా, నేచురోపతి లాంటి అంశాలను మేళవించి ప్రజారోగ్యాన్ని కాపాడతామని తెలిపారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారని.. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. మావోయిస్టులను కట్టడి చేశామని.. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపామని తద్వారా ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చిందని.. 'పెళ్లికి వెళ్తే కూడా రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రతకు వెళ్లిన ఎస్ఐ గాయపడేలా పర్యటనలు ఉంటాయా? గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకునే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?' అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి.. టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్లను 6-7 గంటల ప్రయాణం ఎవరైనా చేస్తారా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడతారా? మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని సీఎం విమర్శించారు. తెలియకుండా జరిగిన నేరంకాదని.. కుట్రతోనే కావాలని చేసిన నేరం ఇది అని అన్నారు. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికలో కూడా 'అది కల్తీ నెయ్యి' అని స్పష్టంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదని సీఎం అన్నారు.

# షర్మిలకు పీసీసీ పదవి హుష్..

## పల్లం రాజుకు కట్టబెట్టే యోచనలో కాంగ్రెస్ హై కమాండ్..



**ఏపీ బ్యూరో, మార్చి 06 - (రిపబ్లిక్ న్యూస్) -**
అనతి కాలంలోనే కాంగ్రెస్ పార్టీలో చేరి పీసీసీ పదవి చేపట్టిన షర్మిలకు నేడు ఆశించిన స్థాయిలో ఆ పార్టీ సీనియర్ల నుండి ఎలాంటి సహకారం అందటం లేదు. దీనిపై పలు రోజులుగా ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. ఏపీ కాంగ్రెస్ చీఫ్ మారబోతున్నారని ప్రస్తుతం ఉన్న షర్మిల సీనియర్లను పట్టించుకోవట్లేదని ప్రస్తుతం ఈ చర్చ సాగుతోంది. ఇటీవల కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ చీఫ్ లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి మీద రాహుల్ గాంధీ వాకబు చేసినట్టు తెలుస్తోంది. ఏపీలో కాంగ్రెస్ మీద ఢిల్లీ పెద్దలు కూడా ప్రత్యేక ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. దీంతో ఏపీ సారథి పై కొత్త ప్రచారం మొదలైంది.

### డీసీసీలు ఏమి చెప్పాయి..

ఇదిలా ఉంటే రాహుల్ గాంధీ నిర్వహించిన ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీలోని అన్ని జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు హాజరయ్యారు. వారి నుంచి ఏపీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మీద ఆరా తీసినట్టు చెప్తున్నారు. వారు పీసీసీ పని తీరు మీద తమైన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పారని ప్రచారం సాగుతోంది. దాంతోనే కాంగ్రెస్ కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది అంటున్నారు.

### సీనియర్లు దూరం..

ఇక ఏపీలో షర్మిల కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు చేపట్టాక ఎంత సేపు వైసీపీని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ను టార్గెట్ చేసుకున్నారని దీనిపై పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్లకు మింగులు పడటం లేదని అంటున్నారు. అధికారంలో కూటమి ప్రభుత్వం ఉందని చంద్రబాబు పవన్ కళ్యాణ్ ల మీద విమర్శలు పెద్ద ఎత్తున చేయడంతో పాటు పోరాటాలు చేయాల్సి ఉండగా ఆ దిశగా తగిన కార్యాచరణ లేదని అంటున్నారు. దాంతో పాటు రెండేళ్ళకు పైగా పార్టీ పదవిలో షర్మిల ఉన్నా కాంగ్రెస్ గ్రాఫ్ ఏ మాత్రం పుంజుకోలేదని అంటున్నారు. ఇక షర్మిల ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న దాని మీద సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారని కొందరంటున్నారు. ల దాంతో వారంతా సైలెంట్ అయి దూరం పాటిస్తున్నారని చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే షర్మిల ప్లేస్ లో కొత్త వారిని తీసుకురావాలని కేంద్ర కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్ గానే ఆలోచిస్తోందని అంటున్నారు.

### పల్లం రాజుకు చాన్స్..

ఉమ్మడి గోదావరి జిల్లాలకు చెందిన కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజుకి పీసీసీ చీఫ్ బాధ్యతలు అప్పగిస్తారని పెద్ద



చర్చే సాగుతోంది. ఆయన కాంగ్రెస్ లో చురుకైన నేతగా ఉన్నారు. కేంద్రంలో రక్షణ శాఖ వంటి కీలక మంత్రిత్వ శాఖను నిర్వహించారు. బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు రాజకీయ చైతన్యం కలిగిన గోదావరి జిల్లాలకు చెందిన వారవడంతో ఆయనను ముందు పెట్టి ఏపీలో కాంగ్రెస్ తన ఉనికిని బలంగా చాటుకోవాలని చూస్తోందని కొందరు కాంగ్రెస్ పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. ఏపీలో రాజకీయ పార్టీల తలరాతను మార్చాలంటే కాపులదే కీలక పాత్రని విశ్లేషణలున్నాయి. ప్రస్తుతం కాపులయితే కాంగ్రెస్ పార్టీపై కొంత అసంతృప్తి గా ఉన్నారని అంటున్నారు. దాంతో వారిని అక్కున చేర్చుకుంటే మెల్లగా ఏపీలో కాంగ్రెస్ కు గట్టి పునాదే వేయొచ్చని యోచనలో ఉన్నట్టు కొందరంటున్నారు. పల్లం రాజు అయితే సీనియర్ నేతలు అంతా పార్టీలో చురుకుగా పనిచేస్తారని హై కమాండ్ సైతం భావిస్తుందట.

### ఏఐసీసీలోకి షర్మిల..

ఇక వైయస్ఆర్ తనయగా షర్మిలకు కేంద్ర స్థాయిలో పార్టీలో కీలక పదవినివ్వాలని కూడా కాంగ్రెస్ పెద్దలు ఆలోచిస్తున్నారని అంటున్నారు. దాంతో రానున్న రోజులలో ఏపీ కాంగ్రెస్ లో కీలకమైన పరిణామాలు చోటు చేసుకోవచ్చని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజమెంతుందో. అంతే కాదు పల్లం రాజు పీసీసీ చీఫ్ పదవి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారన్నది కూడా చర్చ నడుస్తోంది..

# మహిళలపై నేరాలను మొదటి దశలోనే అరికట్టాలి..

**- మహిళల భద్రతలో సమాజం పాత్ర కీలకం..**

**- సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థినీ, విద్యార్థులు అప్రమత్తం..జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**- సోషల్ మీడియా వాడకంలో యువత జాగ్రత్త..ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**

**ఏపీ బ్యూరో, మార్చి 06 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- మహిళలపై నేరాలు చిన్న దశల నుంచి ప్రారంభమై పెద్ద నేరాలకు దారితీసే అవకాశం ఉన్నందున, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి మొదటి దశలోనే అరికట్టాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపు నిచ్చారు. శుక్రవారం మదనపల్లి పట్టణం లోని ఆర్టీసీ బస్టాండు వద్ద గల జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం చేపడుతున్న అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. ఎక్కడైనా నేరాలు జరుగుతున్నట్లు గమనించిన వెంటనే పోలీసులకు, శక్తి టీంకు లేదా విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించాలని సూచించారు. చిన్న స్థాయిలో కనిపించే నేరాలను అదే దశలో ఆపకపోతే అవి తరువాత పెద్ద నేరాలుగా మారే అవకాశముందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి ఒక్కరు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా ఇలాంటి విషయాలను వెంటనే తెలియజేయాలని అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వినియోగం విస్తృతంగా పెరిగిందని పేర్కొన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలను ఎక్కువ మంది వాడుతున్నారని తెలిపారు. నిరంతరం ఫోన్ సందేశాలు, సోషల్ మీడియా అప్డేట్లు చూస్తూ ఉండటం వల్ల వ్యక్తులు తమ పనులపై పూర్తిగా దృష్టి పెట్టలేని పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. సాంకేతికత మనకు సహాయపడుతున్నప్పటికీ మన మేధస్సును పూర్తిగా భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు (ూ×) ఎంత అభివృద్ధి చెందినా మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని తెలిపారు. మనం స్వయంగా ఆలోచించడం, మెదడును ఉపయోగించడం తగ్గిస్తే దీని ప్రభావం భవిష్యత్తులో మానవ సమాజంపై పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్రంలో ఉన్న పరిణామ సిద్ధాంతం ప్రకారం మనం ఉపయోగించని అవయవాలు క్రమంగా పనికిరాని స్థితికి చేరుతాయన్నారు. అదే విధంగా మన మెదడును తక్కువగా ఉపయోగిస్తే దాని ప్రభావం భవిష్యత్తులో మన జీవిత విధానంపై పడే అవకాశముంటుందని తెలిపారు. కాబట్టి సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంతో పాటు మన ఆలోచనా శక్తిని, దృష్టి కేంద్రీకరణను



పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. అలాగే సమాజంలో భద్రతను పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ చురుకైన పాత్ర పోషించాలని కోరారు.

### జిల్లా ఎస్పీ విద్యార్థినీలకు దిశా నిర్దేశం..

విద్యార్థులు సామాజిక మాధ్యమాలను ఉపయోగించే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ సూచించారు. ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా అనేక తప్పుడు ఖాతాలు, తప్పుడు సమాచారాలు సులభంగా సృష్టించబడుతు న్నాయని తెలిపారు. ఫోటోలు, సందేశాలు మరియు సంభాషణలను సులభంగా రూపొందించవచ్చని, కృత్రిమ మేధస్సు (ూ×) సహాయంతో కూడా సందేశాలను తయారు చేయవచ్చని పేర్కొన్నారు. కాబట్టి సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొన్ని సోషల్ మీడియా వేదికల్లో అసభ్యకరమైన కంటెంట్ అధికంగా వ్యాప్తి చెందుతున్నందున విద్యార్థులు అలాంటి విషయాలకు దూరంగా ఉండాలని సూచించారు. తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### భవిష్యత్తు లక్ష్యాలపై అభిప్రాయాలు..

ఈ సందర్భంగా విద్యార్థులతో తమ భవిష్యత్ లక్ష్యాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కోరగా పుంగనూరుకు చెందిన ఒక విద్యార్థిని ప్రస్తుతం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతున్నానని, భవిష్యత్తులో ఐఏఎస్ అధికారి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపింది. ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకు లేచి కరెంట్ అఫైర్స్, సివిక్స్ వంటి విషయాలను క్రమంగా చదువుకుంటున్నానని ఆమె చెప్పగా సభలో ఉన్నవారు చప్పట్లతో అభినందించారు. జీవితంలో ఒక స్థాయికి చేరుకోవడమనేది కార్డులతో రాజభవనం నిర్మించడం లాంటిదని, ఒక్కో మెట్టు జాగ్రత్తగా నిర్మించాలని చిన్న తప్పిదం జరిగినా మొత్తం కూలిపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

### ఎఫ్ ఐ ఆర్ నమోదయితే యువతకు ప్రమాదమే..

ప్రస్తుతం యువతలో వేగంగా వాహనాలు నడపడం, చెడు అలవాట్లు అలవాటు చేసుకోవడం వంటి కారణాలతో కొంతమంది చిన్న వయసులోనే కేసుల్లో ఇరుక్కుంటున్నారని, ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదైతే భవిష్యత్తులో పాస్‌పోర్ట్ పొందడం, పోలీస్ వెరిఫికేషన్ పొందడం కష్టమవుతుందని, ప్రభుత్వ ఉద్యోగాలు దాదాపు అసాధ్యమవుతాయని వివరించారు. ప్రస్తుతం ప్రైవేట్ కంపెనీలు కూడా ఉద్యోగాల నియామకంలో క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్‌ను పరిశీలిస్తున్నా యని తెలిపారు. అలాగే స్నేహితుల ఒత్తిడి కారణంగా కొంతమంది యువత తప్పు నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకొని కష్టపడి చదువు కోవాలని సూచించారు. జీవితంలో పదహారు సంవత్సరాల నుంచి ఇరవై రెండు సంవత్సరాల మధ్య ఉండే ఆరు సంవత్సరాలు అత్యంత కీలకమని ఈ కాలంలో కష్టపడి సరైన దారిలో నడిస్తే తర్వాతి అరవై సంవత్సరాలు సుఖంగా గడపొచ్చని అదే సమయంలో ఈ కాలంలో కష్టపడకుండా సౌకర్యాలను మాత్రమే ఎంచుకుంటే తర్వాతి జీవితమంతా కష్టపడాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం క్రమశిక్షణతో చదువుకుంటూ మంచి లక్ష్యాలను సాధించాలని ఉద్భోటించారు.

### వ్యక్తిగత సంబంధాల విషయంలో అత్యంత జాగ్రత్త..

నేటి యువత, ముఖ్యంగా జెన్-జీ (+వఅ_) తరానికి చెందిన వారు సోషల్ మీడియా వినియోగం మరియు వ్యక్తిగత సంబంధాల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వివాహం వంటి నిర్ణయాలు తీసుకునే ముందు ఉద్యోగం ఉందా లేదా, భవిష్యత్తులో తాను స్వతంత్రంగా నిలబడగలనా లేదా, తల్లిదండ్రుల అభిప్రాయం ఏమిటి వంటి అనేక అంశాలను పరిశీలించడం అవసరమని పేర్కొన్నారు. ఈ అంశాలను సమగ్రంగా ఆలోచించిన తర్వాత నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

### సోషల్ మీడియా వాడకంపై విద్యార్థినులకు దిశా నిర్దేశం..

సోషల్ మీడియాలో ఎవరితో చాట్ చేయాలి. ఎంత వరకు సమాచారం పంచుకోవాలనే అంశంపై విద్యార్థినిలలో నియంత్రణ కలిగుండాలని వ్యక్తిగత విషయాలను ఇతరులతో పంచుకోవద్దని వాటిని ఆసరాగా తీసుకొని మోసం చేసే వాళ్ళున్నారని అలాగే బాగా పరిచయమయ్యామన్న ధోరణిలో ఇతరులు అడిగిన వెంటనే అభ్యంతరకర ఫోటోలను పంపడం లేదా షేర్ చేయడం ప్రమాదకరమని ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి వేదికలపై తెలియని వ్యక్తులతో పరిచయాల విషయంలో 'నో' అని చెప్పడం అలవాటు చేసుకోవాలని ఈ ప్రపంచం మనం అనుకున్నంత స్వచ్ఛంగా ఉండదని, ఎదుటివారు మనల్ని వాడుకునే అవకాశం ఉంటుందని ఇదంతా యువత గుర్తించి మెదలాలని తెలియజేశారు. నేడు మీరు తీసుకునే ప్రతి చిన్న నిర్ణయం మీ రాబోయే 60 ఏళ్ల జీవితానికి పునాదని వివరించారు.

# పాములపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపీఓ- బి.జయంతి.




**పాములపాడు మార్చి 6 రిపబ్లిక్ న్యూస్:-**
మండల కేంద్రమైన పాములపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ- బి.జయంతి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీవో- బి.జయంతి ఉపాధి పనులు చేసే శ్రామికుల మాస్టర్లను వెరిఫికేషన్ చేయడం జరిగింది. పేదలు పనుల కోసం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలసలు పోకుండా నివారించడానికి, పనుల కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్ళందరికీ ఉపాధి హామీ పని కల్పించడం జరుగుతుందన్నారు. వికసిత్ భారత్ జి రామ్ జి ఉపాధి హామీ పథకం మార్పులో శ్రామికులకు ఒక కుటుంబానికి 125 రోజుల పని కల్పించడం జరుగుతుందన్నారు. ఇది గ్రామీణాభివృద్ధికి నూతన సంకల్పం ఉపాధికి కొత్త హామీ అని అన్నారు. ఉపాధి పని కల్పించని ఎడల నిరుద్యోగ భృతి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శ్రామికులకు సమయానికి కూలి చెల్లింపులు ఉంటాయన్నారు. ఇందులో కూడా ఆలస్యమైన చెల్లింపులకు పరిహారం కూడా ఉంటుందన్నారు. గ్రామ సభ ద్వారా వికసిత్ గ్రామపంచాయతీ పనుల ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. ఇందులో శ్రామికుల ఫేస్ యాప్ ఫోటో, చేసే పనుల ఫోటో కూడా ఎప్పటికప్పుడు ఆన్లైన్లో పంపడం జరుగుతుందన్నారు. ఉపాధి శ్రామికులు తమ కొలతల ప్రకారం పనిచేస్తే మంచి కూలి పడుతుందన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంతో కొంత ఇబ్బంది శ్రామికులకు ఉన్న భవిష్యత్తులో పరిష్కారమయ్యే మార్గం ఉందన్నారు. ఎందుకంటే మన గ్రామీణ ప్రాంతాల్లో నెట్వర్క్ సరిగా లేకపోవడంతో ఫేస్ యాప్, మిగతా వాటి కోసం పనుల దగ్గర తీవ్ర ఆలస్యం జరుగుతున్నదని శ్రామికులు మాకు చెప్పడం జరిగిందన్నారు. మేము కూడా శ్రామికుల సమస్యలను మా అధికారులకు తెలియజేసి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాములపాడు ఫీల్డ్ అసిస్టెంట్ జూపల్లె. లింగస్వామి, మేట్ కలబండి. నాగరాజు, ఉపాధి హామీ శ్రామికులు పాల్గొనడం జరిగింది.

# ఉప్పలపాడు గ్రామంలో శనగ పంట క్షేత్ర దినోత్సవం

## రైతులకు శాస్త్రవేత్తల సూచనలు



**ఓర్వకల్లు ప్రతినిధి, మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాలలో శనగ పంట శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ నీలిమ ప్రధాన శాస్త్రవేత్త తెగుళ్ల విభాగం ఓర్వకల్ మండలం ఉప్పలపాడు గ్రామంలో శుక్రవారం రోజున చేపట్టిన ప్రధమ శ్రేణి ప్రదర్శన క్షేత్రమైన ఎన్బిఈజీ 776 రకాల పొలాల్లో క్షేత్ర దినోత్సవం మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ నీలిమ మాట్లాడుతూ షెడ్యూలు కులాలు రైతులు ఆర్థిక స్థితులను మెరుగుపరచడానికి జాతీయస్థాయిలో సెనగ పంటలో ఈ ప్రదర్శనలను నిర్వహించరని ఈ ఎన్ బి ఈజీ 776 రకం ఎండు తెగుళ్లను తట్టుకొని యంత్రంతో కోయడానికి అనువైన రకంగా ఉంటుందని తెలియజేశారు తధానంతరం డాక్టర్ చైతన్య మాట్లాడుతూ శనగ పంటలో పంట వేసిన తర్వాత పాటించే యాజమాన్యం కంటే విత్తనం ఎత్తుకోవడానికి ముందు పాటించే అనగా నూతన శనగ రకాల ఎంపిక విత్తనశక్తి విధానం నెలలో పశువుల ఎరువులో వృద్ధి చేసుకున్న ట్రైకోడరా వినియోగం అంశాల ప్రాముఖ్యతని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో రైతులు రాజు, అయ్య స్వామి, ఈరన్న తదితరులు పాల్గొని విజయవంతం చేశారు

## కాల్వ బుగ్గ నర్సరీకే పెళ్లి మొక్కలను పరిశీలించిన సురేంద్ర కుమార్



**ఓర్వకల్లు ప్రతినిధి, మార్చి 06, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
శుక్రవారంరోజు అంబుడ్స్ పర్సన్ అయినటువంటి సురేంద్ర కుమార్ సోమయాజుల పల్లె కాల్వ గ్రామపంచాయతీలు వెళ్లడం జరిగినది, అందులో భాగంగా సోమయాజుల పల్లె గ్రామపంచాయతీలో మునగ రైతుల పొలములను సందర్శించడం జరిగింది మరియు కాలువ బుగ్గ నర్సరీకే వెళ్లి నర్సరీ బ్యాగ్ సాయిల్ ఫీలింగ్ మరియు మొక్కలను పరిశీలించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఏపీవో టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్ నర్సరీ టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొనడం జరిగింది

# మల్లూరమ్మ ఆలయ ఈవో సస్పెన్షన్..

## నిధుల గోల్‌మాల్‌పై వేటు..





**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 06 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- మల్లూరమ్మ ఆలయ ఈవో పై సస్పెన్షన్ వేటు పడింది. నిధుల గోల్‌మాల్‌పై దేవాదాయ ధర్మాదాయ శాఖ చర్యలు తీసుకుంది. చిన్నమండ్యం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ మాండవ్య నది తీరాన వెలిసిన శ్రీశ్రీశ్రీ మల్లూరమ్మ ఆలయ ఈవో కొండారెడ్డి విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనపై పలు ఆరోపణల నేపథ్యంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ స్పందించింది. విచారణ చేసిన అనంతరం సస్పెన్షన్ వేటు వేసింది. ఆలయ హుండీ తాళాలు మాయం కావడం, అమ్మవారి నగదు లెక్కల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు దేవాదాయ ధర్మాదాయ అధికారులు స్పందించారు. దేవాదాయ శాఖ చెందిన అధికారులు గ్రామానికి విచ్చేసి విచారణ చేపట్టారు. ఆయనపై నిజారోపణలు రావడంతో దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ చర్యలు తీసుకొంటూ ఆయనను విధుల నుంచి తొలగిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

## పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే లక్ష్యం

### ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కొప్పల వసుంధర




**అనంతపురం జేఎన్టీయూ, మార్చి 06,( రిపబ్లిక్ న్యూస్ ):** దివ్యాంగులను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు గుర్తింపు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కొప్పల వసుంధర పేర్కొన్నారు. శుక్రవారం జేఎన్టీయూలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో దివ్యాంగుల అభివృద్ధి కోసం తమ కార్యక్రమాలు అనంతపురంలో కొనసాగించడానికి అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి 14 వరకు స్థానిక ఆర్డిటి స్కూల్, బుక్కరాయసముద్రంలో ఉచిత వ్యాపార శిక్షణ కార్యక్రమం ఇగ్నైట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం కోసం 18 నుంచి 45 ఏళ్ల వయసు గల దివ్యాంగులు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 50 మంది దివ్యాంగులకు అవకాశం ఇస్తున్నామని ఇప్పటికే 25 మంది ఎంపిక చేశామని గ్రామీణ ప్రాంతాల్లో దివ్యాంగులకు ఈ విషయాన్ని చేరవేయడానికి ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అటల్ ఇంకుబేషన్ సెంటర్ ఎస్కేయూ, సేర్ప్ డిఆర్డిఏ అనంతపురం దివ్యాంగుల సంక్షేమ శాఖ, కెనరా బ్యాంకు, ఆర్డిటి, ఏకత్ ఫౌండేషన్ సహకారం అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ శిక్షణ అనంతరం దివ్యాంగులకు బ్యాంకు రుణాలు, కంపెనీలకు కావలసిన మెంటరింగ్ టెక్నాలజీ సపోర్టు, డిపిఆర్ సపోర్టు మొదలైన దాదాపు పది లక్షల విలువైన సర్వీసులు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.

## పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ

**అనంతపురం సంక్షేమం,మార్చి 06, ( రిపబ్లిక్ న్యూస్ ):** పేద కుటుంబాల మహిళలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ డా.ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో 26 రకాలతో కూడిన సరుకులు వారికి అందించారు.ట్రస్ట్ సభ్యులు కల్లుమడి రవీంద్రనాథ్ వారి సతీమణి రమాదేవి గార్ల కుమారుడు సుజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమానికి సహకారం అందించినట్లు తెలిపారు. శుక్రవారం ఆదర్శనగర్ లోని పుట్టినిల్లు ఆశ్రమంలో నగర శివారు ప్రాంతాల్లో ఎంపిక చేసినటువంటి 10మంది పేద కుటుంబానికి చెందిన మహిళలకు నిత్యవసర వస్తువులను అందించారు.




మహిళలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ చైర్ పర్సన్ డా.ఎస్.నిర్మలమురళి

**ఆపదలోనూ ఉన్నవారికి సహాయం చేయాలి**

ఈ సందర్భంగా నిర్మల మురళి మాట్లాడుతూ వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారిని 50 ఏళ్లు పై పడ్డాయని వృత్తి నుంచి తొలగించడం ఎంతవరకు న్యాయము తెలుసుకోవాలన్నారు. మనం చూపించిన ఉపాధిలో జీవనాన్ని వెతుక్కుని జీవిస్తున్న వారికి బాధ్యతగా ప్రతి ఒక్కరు ఆసరాగా నిలవాలన్నారు. అవసరంలోనూ ఆపదలోనూ ఉన్నవారికి ప్రతి ఒక్కరు సహాయం చేయాలని కోరారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వైయస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి





**ఓర్వకల్లు ప్రతినిధి, మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** శుక్రవారం రోజున ఓర్వకల్లు మండలంలో ఉన్న జీవేశ్వర స్వామి కళ్యాణమండపం నందు కనమడకల గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు వెంకటేశ్వర్లు సోదరుని కుమారుడు వివాహ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం కర్నూలు నగరంలోని గుత్తిపెట్రోల్ బంకు సమీపంలో ఉన్న ఖూ= కన్వెన్షన్ హాల్ (హ్యాంగ్ ఔట్) నందు కల్లూరు అర్బన్ : 29వ వార్డు వైఎస్ఆర్సిపి నాయకులు తిరుమలేష్ గౌడ్ కుమారుడు వివాహానికి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు, కల్లూరు మండల నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన




**చిప్పగిరి, మార్చి, 6,( రిపబ్లిక్ న్యూస్ ) పోలీస్** విధులు వారు ఉపయోగించే ఆయుధాలు బాధ్యతలు గురించి విద్యార్థి దశలోనే అవగాహన కల్పించడానికి శుక్రవారం ఎస్ఐ సివి నరసింహులు నిర్వహించారు, పోలీస్ ఆయుధాలను ప్రదర్శించారు, విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు వాటి పనితీరు సాంకేతిక సాధనాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు, ఏకే 47, జిఎఫ్ రైఫిల్, 380 రివాల్వర్ బాంబు పరికరాలు, ఈ ఆయుధాలు పనితీరును వివరించారు, చిప్పగిరి గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థులకు పోలీస్ శాఖ కార్యకలాపాలు వ్యవస్థ నేరాల నివారణ పద్ధతులపై పోలీసుల అవగాహన, విద్యార్థులు పోలీస్ శాఖ రికార్డుల విభాగం, లాకప్ గది, మొదలైన వాటిని పరిశీలించి పోలీసులు పనితీరును సమీపంగా విద్యార్థులు గమనించారు, నేరాలు ఎలా దర్యాప్తు చేస్తారు, ఎఫ్ఐఆర్ ఎలా నమోదు అవుతుంది ప్రజా భద్రత కోసం పోలీసులు ఎలాంటి విధులు నిర్వహిస్తారు, అనే అంశాలను అధికారులు విద్యార్థులకు వివరించారు, ఈ సందర్భంగా ఎస్సై సివి నరసింహులు విద్యార్థులతో మాట్లాడుతూ పోలీసులు ప్రజల రక్షణ కే అహర్నిశలు కృషి చేస్తున్నారని ప్రతి విద్యార్థి చట్టంపై అవగాహన కలిగి ఉంటేనే సమాజంలో నేరాలు తగ్గుతాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రంగనాయకులు విద్యార్థిని ,విద్యార్థులు, పోలీస్ సిబ్బంది సుబ్రహ్మణ్యం, భాస్కర్, మురళీకృష్ణ, పాల్గొన్నారు.



# అగ్గిని రాజేస్తున్న తంబళ్ళపల్లి టీడీపీ బహిష్కృత నేత వ్యాఖ్యలు..

### వచ్చాడమ్మా పతిత అంటూ అదే స్థాయిలో టీడీపీ క్యాడర్ నాయకులు రివర్స్ అటాక్..

**ఏపీ బ్యూరో, మార్చి 06 - (రిపబ్లిక్ న్యూస్) -**
**మదనపల్లి :-** తంబళ్లపల్లి టీడీపీ లో మాటల యుద్ధం తారా స్థాయికి చేరుకుంది. తాజాగా తంబళ్లపల్లి మాజీ శాసనసభ్యులు జి. శంకర్ యాదవ్ కు తంబళ్లపల్లి టీడీపీ పగ్గాలు అప్పగిస్తారన్నా ఊహాగానాల నేపథ్యంలో తబల్లపల్లి టీడీపీ బహిష్కృత నేత నకిలీ మద్యం తయారీ లో సూత్ర పాత్రధారుడిగా పేరు ప్రకటించగానే పరారీలో ఉన్న దాసరపల్లి జయ చంద్రారెడ్డి ఈ వ్యవహారంపై గురువారం ఎక్కడి నుంచో ఓ వీడియోను విడుదల చేశాడు. ఆ వీడియోలో మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గాన్ని కాపాడుకోవాలని పార్టీని బలోపేతం చేసుకోవాలని అసత్యాలు చెప్పి ఒక వారం నుంచి జరుగుతున్న పరిణామాల దృష్ట్యా పార్టీ హై కమాండ్ పెద్దలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ బాబు వద్దకు గత ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన వాళ్ళు వెళ్లి కలుస్తున్నారని గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేయని వాళ్ళు నేడు ఇంచార్జ్ కోసం పాకులాడుతున్నారని దాసరపల్లి జయచంద్రారెడ్డి ఆరోపించారు. నిజమైన కార్యకర్తలు, నాయకులు పార్టీ పేతానికి పార్టీని గెలిపించుకునేందుకు కష్టపడ్డి పని చేసిన నిజమైన కార్యకర్తలు నాయకులు విజయవాడకు పోతున్నారని జయ చంద్రారెడ్డి చెప్పుకొచ్చారు. వారం పది రోజులుగా ఇంచార్జ్ ప్రకటనపై వస్తున్న విషయం కల్పి వేసిందని ఆయన అన్నారు. జి. శంకర్ యాదవ్ కు తంబళ్లపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ గా చేయాలని పరిశీలన చేస్తున్నారని తెలిసి చాలా బాధేసిందని జి. శంకర్ యాదవ్ కాంగ్రెస్ నుంచి తెలుగుదేశం పార్టీకి వచ్చాడని ఆ రోజు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయనను సొంత మనిషిగా భావించి దాదాపు పదివేల మెజారిటీతో గెలిపించారు. కానీ పార్టీ అధికారంలో ఉన్న 2014 నుంచి 19 వరకు తంబళ్లపల్లికి ఆయన చేసింది శూన్యం. ఎటువంటి అభివృద్ధి జరగలేదు. పార్టీ రూలింగ్ లో ఉన్నా కూడా బయట వ్యక్తులకు పర్సంటేజ్ లకు అలవాటు పడి ఇతర పనులను వారికి అప్పగించి టీడీపీ కార్యకర్తలను నాయకులను మోసం చేశాడు. నియోజకవర్గానికి వచ్చిన నిధులను మరియు నియోజకవర్గ అభివృద్ధికి వచ్చిన పనులను ఇతరులకు అమ్ముకున్నాడు. లోకల్ గా ఉన్న కార్యకర్తలకు, నాయకులను పట్టించుకోలేదని జయ చంద్రారెడ్డి చెప్పుకొచ్చాడు. ఇందు కోసం 2019



ఎన్నికల్లో శంకర్ యాదవ్ ఓటమిని చవిచూశారని ప్రత్యర్థి ప్రస్తుత తంబళ్లపల్లి సెట్టింగ్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి పై దాదాపుగా 48 వేల దారుణంగా ఓడిపోయారని జయ చంద్రారెడ్డి వీడియో లో పేర్కొన్నారు. ఆయన ఓడిపోయాక 2024 వరకు నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. అంగళ్ల ఘటనలో చంద్రబాబుపై కేసు నమోదైంది. జి.శంకర్ యాదవ్ పై ఎటువంటి కేసు నమోదు కాలేదు. పెద్దిరెడ్డి మనిషిగా జి శంకర్ యాదవ్ చలామణి అవుతున్నాడు. కాబట్టే ఆయనపై కేసు నమోదు కాలేదని జయచంద్రారెడ్డి వ్యాఖ్యానించాడు. ఈ వీడియో చూసిన టీడీపీ నాయకులు, శ్రేణులకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆయన వ్యాఖ్యలపై రిటర్న్ అటాక్ చేశారు. తంబళ్లపల్లి టీడీపీ శ్రేణులు మాట్లాడుతూ పతిత వచ్చాడమ్మా అంటూ తమదైన శైలిలో టీడీపీ క్యాడర్ నాయకులు విమర్శించారు. పార్టీలో చేరిన కొద్ది నెలలకే కోట్లాది రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి నకిలీ మద్యం తయారీ తో అమాయకుల ప్రాణాలను పణంగా పెట్టి నీ స్వలాభం కోసం నీ జోబులు నింపుకొని కోట్లాది రూపాయలు సంపాదించి నకిలీ మద్యం కేసు బయటపడగానే భయపడి బయట దేశాలకు పారిపోయి విదేశాల్లో తలదాచుకుంటున్న నువ్వు పతిత మాటలు మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని టీడీపీ శ్రేణులు ఎద్దేవ చేశారు. తంబళ్లపల్లి ప్రజలపై నీకు గౌరవమే ఉంటే నువ్వెక్కడున్నా తక్షణమే వచ్చి ప్రభుత్వానికి సరెండర్ అయ్యి న్యాయస్థానం ముందు నిలబడి ఎటువంటి తప్పు చేయలేదని నిర్దోషిగా ప్రూఫ్ చేసుకోవాలని టీడీపీ శ్రేణులు హితవు పలికారు. ఏ తప్పు చేయలేనప్పుడు దేశం విడిచి ఎందుకు పారిపోయావని ఇన్ని నెలలు బయట దేశాల్లో ఎందుకు ఉంటున్నావని ఇప్పటికైనా వచ్చి లొంగిపో అంటూ ఏ తప్పు చేయలేనప్పుడు బయట దేశాల్లో ఏం పనని టీడీపీ శ్రేణులు అంతే ఘాటుగా ఆరోపణలు చేశారు. దేశం విడిచి పారిపోయిన వాళ్లు కూడా తంబళ్లపల్లి రాజకీయంపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ శ్రేణులు విమర్శించారు. మరో టీడీపీ కరుడుగట్టిన నాయకుడు మాట్లాడుతూ కోవర్టు జయచంద్ర రెడ్డి నీ మనుషులను విజయవాడకు ఎందుకు పంపిస్తున్నావని నీకు ఇంకా బుద్ధి రాలేదు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకో మనసు మార్చుకో. దేవుడు నీకు సాయం చేస్తాదంటూ విమర్శలు గుప్పించారు. తంబళ్లపల్లి నియోజకవర్గం పై నీకు ఇక కాలం చెల్లింది. నీ పని నువ్వు చేసుకో. విదేశాలకు పారిపోయావు. ఇక నీకు తంబళ్లపల్లి టీడీపీ పార్టీతో ఏం పనుంది. తంబళ్లపల్లి తెలుగుదేశం పార్టీని నాశనం చేసావు. మళ్లీ తంబళ్లపల్లె నియోజకవర్గం పై ప్రేమ వలగబోయాలని చూడకు. నీకే మంచిది కాదు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణైన పార్టీ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు పార్టీ చూపెడుతున్న కార్యక్రమాలు చాలా ప్రధానమైనవి. అటు వంటి పార్టీని గబ్బు పట్టిచ్చి పార్టీకే చెడ్డపేరు తెచ్చావు. నీకు ఇంకా బుద్ధి రాలేదు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని కాముగా ఉండంటూ టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. కోవర్ట్ రాజకీయాలకు స్వస్తి పలుకు. నీకు తంబళ్లపల్లి నియోజకవర్గానికి ఎటువంటి సంబంధం లేదని తప్పు చేసిన ఆనాడే తెలుగుదేశం పార్టీ నుంచి బహిష్కరించింది. నీకు పార్టీకి ఎటువంటి సంబంధం లేదు. నువ్వు తెలుగుదేశం పార్టీకి చెందిన వాడైతే విదేశాల్లో ఉన్న నువ్వు మీ బావమరిది వచ్చి లొంగిపోండి. న్యాయస్థానం ముందు నిలబడండి. మీరు తప్పు చేయలేదని ప్రూఫ్ చేసుకోండి. అప్పుడు పార్టీ కరుణిస్తుందంటూ తమదైన శైలిలో టీడీపీ నాయకులు రివర్స్ అటాక్ చేశారు..

# అన్నమయ్య జిల్లాలో కలకలం రేపిన రేషన్ బియ్యం దందా...

### - భారీగా రేషన్ బియ్యం స్వాధీనం.! -- అక్రమ బియ్యం వ్యాపారుల్లో వణుకు..
### - పలుచోట్ల విజిలెన్స్ అధికారులు ఏకధాటిగా దాడులు..





**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 06 - (రిపబ్లిక్ న్యూస్)** అన్నమయ్య జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అధికారులు ఉక్కుపాదం మోపారు. పీలేరు మండలంలోని దేవేంద్ర గోడౌన్‌పై కడప విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో అక్రమంగా నిలువ ఉంచిన సుమారు 150 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో వైపు జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణ పరిధిలోని సీటీఎం రోడ్డులో గల ఇండస్ట్రియల్ ఎస్టేట్ రైస్ మిల్లులపై ఏకధాటిగా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి సోదాలు చేపట్టారు. అక్కడ పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడింది. కొందరి బడా వ్యాపారస్తుల కనుసైగల్లో ఈ రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి, రసాయనాలు కలిపి రంగు మార్చి దారి మళ్లిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో జరిగిన ఈ దాడులు జిల్లాలోని అక్రమ బియ్యం వ్యాపారుల్లో వణుకు పుట్టించాయి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కడప విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ పర్యవేక్షణలో సీఐలు శివన్న, శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో కలిసి సోదాలు చేస్తున్నారు. రెండు మిల్లుల్లో భారీగా పట్టుబడిన రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశామని కరీముల్లా షరీఫ్ తెలిపారు. గోడౌన్లలో నిల్వ ఉంచిన ఈ రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి బెంగళూరు, చెన్నై, తిరుపతి, కడప లతో పాటు ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని విజిలెన్స్ అధికారులు తెలిపారు. దళారులు రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం కొని, మిల్లులకు అమ్మేస్తున్నారు. అక్కడ వాటిని రీసైక్లింగ్ చేసి, కొత్త సంచుల్లో నింపి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. కొందరు అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని ఒకటికి రెండుసార్లు పాలిష్ చేస్తారు. రీసైక్లింగ్ చేసి వాటిని సన్న బియ్యంగా మారుస్తారు. ఈ బియ్యాన్ని 25 బస్తాల్లో నింపేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వేరే ప్రాంతాలకు తరలించి సన్న బియ్యం పేరుతో ఈ దందా సాగిస్తున్నారు. ఆ బియ్యాన్ని ఎక్కువ ధరకు అమ్మేసి క్యాష్ చేసుకుంటున్నారు. గత



కొంతకాలంగా ఈ బియ్యం వ్యవహారం నడుస్తున్నట్లు గుర్తించారు.

**కొందరి వ్యాపారస్తుల ధనజ్యం..**

కొందరి వ్యాపారస్తుల ధనజ్యం కోసం ఎంచక్కా రేషన్ బియ్యానికి రసాయనాలు కలిపి, పాలిష్ చేసి, సాధారణ బియ్యంగా మార్చి అధిక ధరలకు విక్రయించే అక్రమ దందా అన్నమయ్య జిల్లావ్యాప్తంగా జోరుగా సాగుతోంది. ఈ బియ్యం తెల్లగా, నిగనిగలాడేలా కనిపిస్తాయి. కానీ ఇవి ఆరోగ్యానికి ప్రమాదకరం, ఎందుకంటే పాలిషింగ్ ప్రక్రియలో పోషకాలు కోల్పోతాయి. మరియు హానికరమైన రసాయనాలు బియ్యానికి అంటుకుంటాయి.

**అక్రమ దందా ..**

రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, రంగు మరియు మెరుపు కోసం రసాయనాలను ఉపయోగించి పాలిష్ చేస్తారు. ఈ విధంగా పాలిష్ చేసిన బియ్యం వల్ల జీర్ణక్రియ సమస్యలు, పోషకాల లోపం ఏర్పడవచ్చు.

**రేషన్ బియ్యం మరియు సాధారణ బియ్యం మధ్య ఉన్న ముఖ్యమైన తేడాలు..**

రేషన్ బియ్యం సాధారణంగా పరిమాణంలో చిన్నగా మరియు ముదురు రంగులో ఉంటాయి. పాలిష్ చేసిన తర్వాత తెల్లగా మారుతాయి..

# మహిళలపై నేరాలను మొదటి దశలోనే అరికట్టాలి..

**- మహిళల భద్రతలో సమాజం పాత్ర కీలకం..**

**- సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థినీ, విద్యార్థులు అప్రమత్తం..జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**- సోషల్ మీడియా వాడకంలో యువత జాగ్రత్త..ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**



**ఏపీ బ్యూరో, మార్చి 06 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- మహిళలపై నేరాలు చిన్న దశల నుంచి ప్రారంభమై పెద్ద నేరాలకు దారితీసే అవకాశం ఉన్నందున, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి మొదటి దశలోనే అరికట్టాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపు నిచ్చారు. శుక్రవారం మదనపల్లి పట్టణం లోని ఆర్టీసీ బస్టాండు వద్ద గల జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం చేపడుతున్న అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. ఎక్కడైనా నేరాలు జరుగుతున్నట్లు గమనించిన వెంటనే పోలీసులకు, శక్తి టీంకు లేదా విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించాలని సూచించారు. చిన్న స్థాయిలో కనిపించే నేరాలను అదే దశలో ఆపకపోతే అవి తరువాత పెద్ద నేరాలుగా మారే అవకాశముందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి ఒక్కరు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా ఇలాంటి విషయాలను వెంటనే తెలియజేయాలని అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వినియోగం విస్తృతంగా పెరిగిందని పేర్కొన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలను ఎక్కువ మంది వాడుతున్నారని తెలిపారు. నిరంతరం ఫోన్ సందేశాలు, సోషల్ మీడియా అప్డేట్లు చూస్తూ ఉండటం వల్ల వ్యక్తులు తమ పనులపై పూర్తిగా దృష్టి పెట్టలేని పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. సాంకేతికత మనకు సహాయపడుతున్నప్పటికీ మన మేధస్సును పూర్తిగా భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ఎంత అభివృద్ధి చెందినా మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని తెలిపారు. మనం స్వయంగా ఆలోచించడం, మెదడును ఉపయోగించడం తగ్గిస్తే దీని ప్రభావం భవిష్యత్తులో మానవ సమాజంపై పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. విజ్ఞాన శాస్త్రంలో ఉన్న పరిణామ సిద్ధాంతం ప్రకారం మనం ఉపయోగించని అవయవాలు క్రమంగా పనికిరాని స్థితికి చేరుతాయన్నారు. అదే విధంగా మన మెదడును తక్కువగా ఉపయోగిస్తే దాని ప్రభావం భవిష్యత్తులో మన జీవిత విధానంపై పడే అవకాశముంటుందని తెలిపారు. కాబట్టి సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంతో పాటు మన ఆలోచనా శక్తిని, దృష్టి కేంద్రీకరణను పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. అలాగే సమాజంలో భద్రతను పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ చురుకైన పాత్ర పోషించాలని కోరారు.

**జిల్లా ఎస్పీ విద్యార్థినీలకు దిశా నిర్దేశం..**

విద్యార్థులు సామాజిక మాధ్యమాలను ఉపయోగించే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ సూచించారు. ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా అనేక తప్పుడు ఖాతాలు, తప్పుడు సమాచారాలు సులభంగా సృష్టించబడుతు న్నాయని తెలిపారు. ఫోటోలు, సందేశాలు మరియు సంభాషణలను సులభంగా రూపొందించవచ్చని, కృత్రిమ మేధస్సు (ఏఐ) సహాయంతో కూడా సందేశాలను తయారు చేయవచ్చని పేర్కొన్నారు. కాబట్టి సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొన్ని సోషల్ మీడియా వేదికల్లో అసభ్యకరమైన కంటెంట్ అధికంగా వ్యాప్తి చెందుతున్నందున విద్యార్థులు అలాంటి విషయాలకు దూరంగా ఉండాలని సూచించారు. తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

**భవిష్యత్తు లక్ష్యాలపై అభిప్రాయాలు..**

ఈ సందర్భంగా విద్యార్థులతో తమ భవిష్యత్ లక్ష్యాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కోరగా పుంగనూరుకు చెందిన ఒక విద్యార్థిని ప్రస్తుతం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతున్నానని, భవిష్యత్తులో ఐఏఎస్ అధికారి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపింది. ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకు లేచి కరెంట్ అఫైర్స్, సివిక్స్ వంటి విషయాలను క్రమంగా చదువుకుంటున్నానని ఆమె చెప్పగా సభలో ఉన్నవారు చప్పట్లతో అభినందించారు. జీవితంలో ఒక స్థాయికి చేరుకోవడమనేది కార్డులతో రాజభవనం నిర్మించడం లాంటిదని, ఒక్కో మెట్టు జాగ్రత్తగా నిర్మించాలని చిన్న తప్పిదం జరిగినా మొత్తం కూలిపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

**ఎఫ్ ఐ ఆర్ నమోదయితే యువతకు ప్రమాదమే..**

ప్రస్తుతం యువతలో వేగంగా వాహనాలు నడపడం, చెడు అలవాట్లు అలవాటు చేసుకోవడం వంటి కారణాలతో కొంతమంది చిన్న వయసులోనే కేసుల్లో ఇరుక్కుంటున్నారని, ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదైతే భవిష్యత్తులో పాస్‌పోర్ట్ పొందడం, పోలీస్ వెరిఫికేషన్ పొందడం కష్టమవుతుందని, ప్రభుత్వ ఉద్యోగాలు దాదాపు అసాధ్యమవుతాయని వివరించారు. ప్రస్తుతం ప్రైవేట్ కంపెనీలు కూడా ఉద్యోగాల నియామకంలో క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్‌ను పరిశీలిస్తున్నా యని తెలిపారు. అలాగే స్నేహితుల ఒత్తిడి కారణంగా కొంతమంది యువత తప్పు నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకొని కష్టపడి చదువు కోవాలని సూచించారు. జీవితంలో పదహారు సంవత్సరాల నుంచి ఇరవై రెండు సంవత్సరాల మధ్య ఉండే ఆరు సంవత్సరాలు అత్యంత కీలకమని ఈ కాలంలో కష్టపడి సరైన దారిలో నడిస్తే తర్వాతి అరవై సంవత్సరాలు సుఖంగా గడపొచ్చని అదే సమయంలో ఈ కాలంలో కష్టపడకుండా సౌకర్యాలను మాత్రమే ఎంచుకుంటే తర్వాతి జీవితమంతా కష్టపడాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం క్రమశిక్షణతో చదువుకుంటూ మంచి లక్ష్యాలను సాధించాలని ఉద్ఘాటించారు.

**వ్యక్తిగత సంబంధాల విషయంలో అత్యంత జాగ్రత్త..**

నేటి యువత, ముఖ్యంగా జెన్-జీ (+వఙ్గ) తరానికి చెందిన వారు సోషల్ మీడియా వినియోగం మరియు వ్యక్తిగత సంబంధాల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వివాహం వంటి నిర్ణయాలు తీసుకునే ముందు ఉద్యోగం ఉందా లేదా, భవిష్యత్తులో తాను స్వతంత్రంగా నిలబడగలనా లేదా, తల్లిదండ్రుల అభిప్రాయం ఏమిటి వంటి అనేక అంశాలను పరిశీలించడం అవసరమని పేర్కొన్నారు. ఈ అంశాలను సమగ్రంగా ఆలోచించిన తర్వాత నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

**సోషల్ మీడియా వాడకంపై విద్యార్థినులకు దిశా నిర్దేశం..**

సోషల్ మీడియాలో ఎవరితో చాట్ చేయాలి. ఎంత వరకు సమాచారం పంచుకోవాలనే అంశంపై విద్యార్థినిలలో నియంత్రణ కలిగుండాలని వ్యక్తిగత విషయాలను ఇతరులతో పంచుకోవద్దని వాటిని ఆసరాగా తీసుకొని మోసం చేసే వాళ్ళున్నారని అలాగే బాగా పరిచయమయ్యామన్న ధోరణిలో ఇతరులు అడిగిన వెంటనే అభ్యంతరకర ఫోటోలను పంపడం లేదా షేర్ చేయడం ప్రమాదకరమని ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి వేదికలపై తెలియని వ్యక్తులతో పరిచయాల విషయంలో 'నో' అని చెప్పడం అలవాటు చేసుకోవాలని ఈ ప్రపంచం మనం అనుకున్నంత స్వచ్ఛంగా ఉండదని, ఎదుటివారు మనల్ని వాడుకునే అవకాశం ఉంటుందని ఇదంతా యువత గుర్తించి మెదలాలని తెలియజేశారు. నేడు మీరు తీసుకునే ప్రతి చిన్న నిర్ణయం మీ రాబోయే 60 ఏళ్ల జీవితానికి పునాదని వివరించారు.

**మహిళలపై జరిగే నేరాలపై కఠిన చర్యలు..**

అదే విధంగా మహిళలు, పిల్లలు, యువతిపై ఎటువంటి వేధింపులు, అన్యాయాలు లేదా నేరాలు జరిగినా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. పోక్సో కేసులు, ఈవ్ టీజింగ్, సైబర్ స్టాకింగ్, అత్యాచారాలు వంటి మహిళలపై జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు మరియు పిల్లలకు భద్రమైన సమాజాన్ని అందించేందుకు అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ ఎప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజల సహకారం కూడా అవసరమని కోరారు. చివరగా విద్యార్థులందరూ తమ భవిష్యత్తులో అనుకున్న లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.
అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ విధి నిర్వహణలో విద్యార్థిని, విద్యార్థులు మరియు యువతి యువకుల ప్రేమ పెళ్లిల జీవితం గురించి తమకు ఎదురైన అనుభవాలను విద్యార్థులకు తెలియజేస్తూ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలతో విద్యార్థినీ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో తయారుచేసిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్ షార్ట్ ఫిలింను, వివిధ ప్రదేశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ఫోటోలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎం. వెంకటాద్రి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శంకర మల్లయ్య, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, శక్తి టీం ఎస్సై గాయత్రి, పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపకు సిపిఐ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**మార్చి 8 నుండి 15 వరకు జిల్లాలో విరాళాల సేకరణ -సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. రామాంజనేయులు పిలుపు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 6)**
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిర్వహిస్తున్న పోరాటాలకు ప్రజల మద్దతు పెంపొందించేందుకు "గడప గడపకు సిపిఐ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె. రామాంజనేయులు పిలుపునిచ్చారు.
శుక్రవారం కర్నూలులోని సి.ఆర్. భవన్‌లో సిపిఐ కర్నూలు జిల్లా సమితి సభ్యుల సమావేశం కె. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, ఆవుల శేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పాల్గొని ప్రసంగించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తున్నదన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడం, పార్టీ పోరాటాలకు బలాన్ని చేకూర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా "గడప గడపకు సిపిఐ" పేరుతో ప్రజల నుండి విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో ఈ నెల 8వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.
అమెరికా సామ్రాజ్యవాద చర్యలపై దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. అలాగే ఎన్నికల సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదని అన్నారు.
ఈ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.
కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన వేదవతిఉండ్రేవుల, ఆర్డీఎస్ కుడికాలువ, పందికొన రిజర్వాయర్, అందరినీవా కాలువల నిర్మాణానికి తక్షణమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

# బోయకొండ గంగమ్మ దేవస్థానంలో బహిరంగ వేలం

## -ప్రశాంతంగా సాగిన లైసెన్స్ హక్కుల వేలం

**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 06 రిపబ్లిక్ న్యూస్**



చౌడేపల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో వివిధ లైసెన్స్ హక్కుల కేటాయింపునకు దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలం రెండో రోజు కూడా ప్రశాంత వాతావరణంలో జరిగింది. గురువారం దేవస్థానం కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ వేలానికి భక్తులు, వ్యాపారులు, డిపాజిట్ దారులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీగా పాల్గొన్నారు. ఈ వేలం ద్వారా దేవస్థానానికి మొత్తం రూ. 24,21,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ, ఉప కమిషనర్ జె. ఏకాంబరం తెలిపారు. ప్రతి లైసెన్స్ హక్కుకు పోటీగా బిడ్లు పడటంతో వేలం ఉత్సాహభరితంగా సాగిందన్నారు. దేవస్థానం పరిసర ప్రాంతాలలో అమ్మవారికి భక్తులు సమర్పించే కొబ్బరికాయల పైచిప్పలను సేకరించుకునే హక్కును కె. మల్లికార్జున రూ. 7,70,000లకు దక్కించుకున్నారు. దేవస్థానం పరిసర ప్రాంతంలో స్టీల్, రాగి, ఇత్తడి ప్లేట్లు, జోతులు, హారతి పళ్లెం వంటి పూజా సామగ్రి విక్రయించే హక్కును సోము రూ. 90,000లకు పొందారు. అలాగే కొండ కింద కోళ్ల విక్రయ హక్కును ఆర్. పవన్ రూ. 7,00,000లకు సొంతం చేసుకున్నారు. భక్తులకు అవసరమైన పేపర్ కవర్లు, బ్యాగులు విక్రయించే హక్కును సి. గజేంద్ర రూ. 6,70,000లకు కైవసం చేసుకున్నారు. దేవస్థానంలో ఫోటోలు తీసుకునే హక్కుకు జరిగిన వేలంలో కిరణ్ రూ. 1,91,000కు హెచ్చుపాటుగా బిడ్ వేయడంతో ఆ హక్కును పొందారు. ఇంకా కొన్ని లైసెన్స్ హక్కులకు ఎవరూ హాజరుకాకపోవడంతో ఆ హక్కుల వేలాన్ని తరువాతి తేదీకి వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, ఉప కమిషనర్ జె. ఏకాంబరం, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ ప్రధాన అర్చకులు గంగిరెడ్డి, సుధాకర్, చౌడేపల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ చిన్నరెడ్డెప్ప, పోలీస్ సిబ్బంది, ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది, డిపాజిట్ దారులు తదితరులు పాల్గొన్నారు.

# బలపాల పల్లె రోడ్ లో ఉన్న ట్రాన్స్ఫారం దగ్గర చెత్తాచెదారం

**బేతంచెర్ల ప్రతినిధి, మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



శుక్రవారం రోజున బేతంచెర్ల నగర కరెంటు ఏఈకి బలపాలపల్లె రోడ్డులో ఉన్న ట్రాన్స్ఫారంచుట్టుపక్కల పొలాల రైతులు ట్రాన్స్ఫారం చెత్తాచెదారం ఉండడం వలన ఫీజులుఎగిరిపోతున్నందువలనమోటార్లుకాలిపోతున్నాయి, రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు, ట్రాన్స్ఫారం దగ్గర చెత్త దానికి తెగలు అలకపోవడంతో ఎక్కువగా ఫీజులు కాలిపోతున్నాయి పేరుకుపోయి చెత్తని చుట్టుపక్కల క్లీన్ చేసిఫీజులు పోకుండా చేయవలసిందిగా బేతంచర్ల నగర ఏఈకి చుట్టుపక్కల రైతులు కోరుకుంటున్నారు, మూలాన సిద్దప్ప గుడి దగ్గర హోసన్నా చర్చి పక్కన ఉన్న మా స్వంత వ్యవసాయ క్షేత్రం నాగలిచెరువులో పదే పదే మోటార్లు రైతుల పొలాల్లో మోటర్లు కాలిపోతున్నాయి అనవసర ఖర్చులు వస్తున్నాయి. అంతేకాదు మా పక్క పొలాల్లో కూడావారి మోటార్లు సైతం కాలిపోతున్నాయి. రైతులను దృష్టిలో పెట్టుకుని బేతంచెర్ల నగర కరెంటు ఏఈ తక్షణమే అక్కడ పెరుకపోయిన చెత్తను క్లీన్ చేసి ఫీజులు వేయవలసిందిగా రైతులు కోరుకుంటున్నారు, కాబట్టి తక్షణమే చర్య తీసుకోని మీ సిబ్బంది ద్వారా ట్రాన్స్ఫారం చుట్టూ పక్క ల అల్లుకుపోయిన తీగలను తీయించి ఫీజు వేయవలసినదిగా విజ్ఞ చేస్తున్న రైతులు బేతంచెర్ల నగర కరెంటు ఏఈని కోరుచున్నారు రైతులు

# పెద్ద హరివనంలో అక్రమ ఎల్పీజీ వినియోగంపై దాడులు

**15 హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై తనిఖీలు 34 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం -నిత్యావసర సరుకుల చట్టం కింద కేసులు నమోదు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 6)**
ఆదోని ఆర్డీఓ ఆధ్వర్యంలో ఆదోని మండలం పెద్ద హరివనం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారన్న సమాచారంతో నాలుగు బృందాలుగా అధికారులు తనిఖీలు చేపట్టారు.
ఈ తనిఖీల్లో గ్రామంలోని మొత్తం 15 హోటళ్లు, టిఫిన్ సెంటర్లను పరిశీలించారు. పరిశీలనలో గృహ అవసరాల కోసం మాత్రమే వినియోగించాల్సిన 34 డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్లను వ్యాపార అవసరాల కోసం ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై సంబంధిత హోటల్ మరియు టిఫిన్ సెంటర్ యజమానులపై నిత్యావసర సరుకుల చట్టం సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేసి, వినియోగంలో ఉన్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.
గృహ అవసరాల కోసం ఉద్దేశించిన డొమెస్టిక్ సిలిండర్లను హోటళ్లలో లేదా ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు పాల్పడితే సిలిండర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలపై తనిఖీలు భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.



అలాగే ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు డొమెస్టిక్ సిలిండర్లను హోటళ్లకు లేదా ఇతర వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత డిస్ట్రిబ్యూటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకొని వారి లైసెన్సులను రద్దు చేసే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
దీపం పథకం కింద ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సిలిండర్లను ఎవరైనా వినియోగదారులు హోటళ్లకు లేదా వాణిజ్య అవసరాలకు విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో వారి సబ్సిడీని రద్దు చేయడంతో పాటు ఎల్పీజీ కనెక్షన్లను కూడా రద్దు చేసే చర్యలు తీసుకుంటామని తెలిపారు.
అదేవిధంగా దీపం పథకం కింద సిలిండర్లను సరఫరా చేసే సమయంలో డెలివరీ బాయ్స్ వినియోగదారులతో అమర్యాదగా ప్రవర్తించినా లేదా బిల్లులో చూపిన ధర కంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేసినా, వినియోగదారులు సంబంధిత సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్, మండల తహసీల్దార్ లేదా జిల్లా పౌర సరఫరాల అధికారికి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అవసరమైతే 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు కూడా తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని జిల్లా పౌర సరఫరాల అధికారి తెలిపారు.













# ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి



**ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్**

**అనంతపురం ప్రతినిధి, మార్చి 06,(రిపబ్లిక్ న్యూస్):** యువ వైద్యులు గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. అనంతపురం శారదానగర్ లో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలో ఉల్లాసంగా ఉత్సాహంగా ప్రభుత్వ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం వైద్య కళాశాలలో 2కే20 వైద్య విద్య పూర్తి చేసుకొన్న విద్యార్థులకు స్నాతకోత్సవాన్ని ప్రభుత్వ సుపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి చంద్రశేఖర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి,వైస్ ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా,సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనెడిక్ట,వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య విద్యార్థులు సమాజానికి సేవలందించాలి

ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ యువ వైద్యులు గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైద్య రంగంలో నిరంతర మార్పులు, ఆవిష్కరణలు తెలుసుకోవాలన్నారు. మరి ముఖ్యంగా ఆర్టిపిసిఎల్ ఇంటెలిజెన్స్ యువ వైద్యులు తెలుసుకొని, నూతన వైద్య విధానం కొనసాగించాలన్నారు.తల్లిదండ్రుల కన్న కలలు సహకారం చేస్తూ

వైద్య విద్యార్థులు సమాజానికి సేవలందించాలన్నారు. వైద్య విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. వివిధ విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులతో పాటు 150 మంది వైద్య విద్యార్థులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి చంద్రశేఖర్ ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందించారు.

### వివిధ విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన వైద్య విద్యార్థులు

ఈ ఎన్ టి నిఖిత,మూడవ సంవత్సరం ఈ ఎన్ టి సిద్ది సాయి వెంకట రమాదేవి,ఎస్ పి ఎమ్ శాలిని స్మృతి, ఎఫ్ ఎమ్ టి హరిత, ఓ బి జి హరిత, శ్రీజ దీపిక, సర్జరీ కృష్ణ కాంత్ కు గోల్డ్ మెడల్స్ ను అందజేశారు.





# జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు

## కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సజావుగా అమలు చేయాలి -పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ

## జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం జెడ్పీ, మార్చి 06,( రిపబ్లిక్ న్యూస్ ):** జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సజావుగా, మరింత బాగా అమలు చేయాలని పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని డిపిఆర్సీ సమావేశ మందిరంలో దిశా (జిల్లా అభివృద్ధి సమన్వయ & పర్యవేక్షణ కమిటీ) సమావేశాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించగా, జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జెడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

**మెరుగైన సేవలను ప్రజలకు అందించే దిశగా చర్యలు**

ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు అంబికా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల అమలుకు సంబంధించి నిధుల అంశంపై, పనితీరు మెరుగుపరచడంపై సమీక్ష నిర్వహించామన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష చేసి, ఇంకా ఏమైనా ప్రభావంతంగా అమలు చేయడానికి సూచనలను తీసుకుని మెరుగైన సేవలను ప్రజలకు అందించే దిశలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలపాలన్నారు. తాజాగా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు సమావేశం నిర్వహించడం జరిగిందని, ఇందులో జిల్లా పనితీరు బాగుందని, జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని సీఎం తెలిపారన్నారు. జిల్లా కలెక్టర్ వేగవంతంగా పని చేస్తున్నారని, ఆదర్శవంతంగా జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. మన్ కి బాత్ లో కూడా దేశ ప్రధాని జిల్లా రైతులు, శ్రమజీవుల గురించి మాట్లాడి అభినందించారన్నారు. అన్ని కేంద్ర పథకాల అమలులో పూర్తిస్థాయిలో పనిచేయాలన్నారు.






సాయిల్ టెస్టింగ్ ల్యాబ్స్ పనిచేసేలా చూడాలన్నారు. అనంతపురం రూరల్ లోని నారాయణపురంలో ఉపాధి పనులకు సంబంధించిన మస్టర్ ఓపెన్ కావడం లేదని, నిర్దేశిత సమయంలోగా సమస్య పరిష్కరించాలన్నారు. ఎన్ఆర్ఈజిఎస్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి గడువులోపు పూర్తిచేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. హార్టికల్చర్, ఫామ్ మెకనైజేషన్, డ్వామా, పిఎంకెఎస్వై, నేషనల్ హెల్త్ మిషన్, అంబేద్కర్ గురుకులం, మైనారిటీ వెల్ఫేర్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది.

**108 వాహనాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి**

ఈ సందర్భంగా జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఎక్కువగా ఉన్నాయని, వాటి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై పాఠశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. 108 వాహనాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, కొన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్ఆర్ఈజిఎస్ కింద చేస్తున్న పనులు పూర్తికి మరికొంత సమయం ఇవ్వాలన్నారు.

**జిల్లాలో మైక్రో ఇరిగేషన్, హార్టికల్చర్ అభివృద్ధి పై దృష్టి**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ దిశా సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. బెలుగుప్ప మండలం ఆవులన్న సొసైటీని తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిసిఓని ఆదేశించారు. జిల్లాలో మైక్రో ఇరిగేషన్, హార్టికల్చర్ అభివృద్ధి, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. పిఎండిడికేవై కింద కార్యచరణ ప్రణాళిక పంపించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ కింద మరింత విస్తీర్ణం పెంచేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. ఆత్మ పరిధిలో అగ్రిటెక్ స్టార్టప్ లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్ఆర్ఈజిఎస్ కింద జిల్లాలో చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని, నెలాఖరు నాటికి పనులు అయినంతవరకు బిల్లులు అప్లోడ్ చేసి వాటిని పూర్తి చేయాలని, ఇందులో ఏవైనా సమస్యలు ఉంటే డ్వామా పీడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం అర్హత ఉంటే గ్రామాల్లో పిహెచ్సి ఏర్పాటుకు అవకాశం ఉంటే సంబంధిత అధికారులు తెలియజేయాలన్నారు. 108 వాహనాలు రావడం ఆలస్యం అవుతోందని పలు ఫిర్యాదులు వస్తున్నాయని, సమయానికి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని, పూర్తి వివరాలతో సమావేశానికి రావాలని 108 జిల్లా కోఆర్డినేటర్ ని ఆదేశించారు. అనంతరం రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ విముక్తి రథంపై సంతకాల సేకరణలో భాగంగా ఎంపీ, జిల్లా కలెక్టర్, ఆయా శాఖల జిల్లా అధికారులు సంతకాలు చేశారు. బాల్య వివాహ రహిత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో సిపిఓ అశోక్ కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బరాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి రవి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, డిసిఓ అరుణకుమారి, హౌసింగ్ పిడి శైలజ, ఐసీడీఎస్ పిడి శ్రీదేవి, డిఆర్డీఏ పిడి శైలజ, మైన్స్ డిడి ఆదినారాయణ, నాబార్డు ఏజిఎం అనురాధ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఎస్సి కార్పొరేషన్ ఈడి కుముద, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లీశ్వరి, డిసిఓ అరుణకుమారి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, సివిల్ సప్లయిస్ డిఎం రమేష్ రెడ్డి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, కమిటీ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ మాతమ్మ తల్లి దేవాలయనిర్మాణంకు శంకుస్థాపన.



**ఓబులవారిపల్లి మార్చి 6 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వే కోడూరు నియోజకవర్గం అయ్యవారిపల్లి గ్రామం అరుంధతివాడ గ్రామంలో గ్రామదేవత శ్రీశ్రీశ్రీ మాతమ్మ తల్లి దేవాలయం పునర్నిర్మాణ శంకుస్థాపన జరిగినది ఈ కార్యక్రమం రైల్వే కోడూరు నియోజక వర్గం ఎం డి పి ఎస్ అధ్యక్షుడు కొత్తూరు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం శ్రేయస్ కొరకు సుఖశాంతులతో పాడిపంటలు వీరజాలన్నీ అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు,ఉపాధ్యక్షుడు ఇరువురి వెంకట సాయి, రైల్వే కోడూరు మండల అధ్యక్షులు ఇరువురి మహేష్, ఇరువురి వెంకటయ్య, ఈటామార్పురం బాలాజీ, కొండూరు పార్థసారథి తదుపరి గ్రామస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు



# కర్నూలులో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అభ్యర్థులకు దేహదారుఢ్య, వైద్య పరీక్షలు

**గ్రూప్2 ఫలితాల్లో ఎంపికైన జోన్4కు చెందిన 42 మందిలో 20 మందికి పరీక్షలు పూర్తి -మిగతా 22 మందికి రేపు నిర్వహణ**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 6)**



ఇటీవల విడుదలైన గ్రూప్2 పరీక్ష ఫలితాల ఆధారంగా జోన్4 కర్నూలు జోన్‌కు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికైన అభ్యర్థులకు దేహదారుఢ్య మరియు వైద్య పరీక్షలు నిర్వహించారు.
ఈ కార్యక్రమాన్ని కర్నూలు డిప్యూటీ కమిషనర్ శ్రీమతి పి. శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. హనుమంతరావు సమక్షంలో నిర్వహించారు. మొత్తం 42 మంది అభ్యర్థుల్లో ఈరోజు హాజరైన 20 మందికి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ జావిద్ మరియు ఆయన బృందం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అభ్యర్థులకు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మిగతా 22 మంది అభ్యర్థులకు రేపు దేహదారుఢ్య మరియు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్‌లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు చంద్రహాస్, కె.ఆర్. రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా ఆస్తులపైనే మా దాడులు

**అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు**

**ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే**

న్యూఢిల్లీ,**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**




పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. 'ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది' అని అన్నారు.

--------------

# పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

**200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన**

న్యూఢిల్లీ,**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**




అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

------------

# ఎపి శాసనసభ నిరవధిక వాయిదా

**15 రోజులు సమావేశాలు జరిగాయి**

**వివరాలు వెల్లడించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

అమరావతి,**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



ఏపీ శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు జరిగేందుకు సహకరించిన అందరికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృతజ్ఞతలు తెలిపారు. 16వ శాసనసభ ఐదో సమావేశాలు 15 రోజుల పాటు జరిగాయన్నారు. 72 గంటల 14 నిమిషాల పాటు సమావేశాలు జరిగాయని స్పీకర్ తెలిపారు. మొత్తం 122 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారని... 80 ప్రశ్నలకు సభాసమక్షంలో ఉంచారని చెప్పారు. ఈసారి సమావేశాల్లో 18 బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఒక లఘు చర్చ, 344వ నియమం కింద చర్చించిన అంశాలు ఒకటి అని వివరించారు. శాసనసభలో టీడీపీ- 135, జనసేన-21, వైసీపీ-11, బీజేపీ-8 మంది సభ్యులున్నారని స్పీకర్ తెలిపారు. ఈరోజు సాయంత్రం సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కుటుంబసమేతంగా రావాలని స్పీకర్ కోరారు. క్రీడాపోటీల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 166 పాఠశాలల నుంచి 6,693 విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారని.. అసెంబ్లీకి ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులు ఎప్పుడూ రాలేదని స్పీకర్ అన్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు.

# ఈ యుద్ధం ముగిసేదెలా ?

**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది. తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది. ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయం లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయ త్నించడం లేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్పు ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహరణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.

# మరోమారు బొత్సకు అస్వస్థత

**బిపి హెచ్చు తగ్గులతో అలసట**

**వెంటనే వైద్యులను పిలిపించి పరీక్షలు**

అమరావతి,**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మరోమారు అస్వస్థతకు గురయ్యారు. సభలో ప్రసంగిస్తూ ఇబ్బందిపడటంతో అక్కడి అధికారులు అత్యవసరంగా అసెంబ్లీకి వైద్యులను పిలిపించారు. పరీక్షించిన వైద్యులు.. బీపీలో హెచ్చుతగ్గుల వల్లే అస్వస్థతకు గురైనట్లు వెల్లడించారు. ఆయనకు విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. వైద్యుల సూచన మేరకు బొత్స ఇంటికి బయల్దేరారు. సభలో ప్రసంగించేటప్పుడు పరిస్థితిని గమనించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయన్ను విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే, బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం. అయితే మూడ్రోజుల విశ్రాంతి అనంతరం శుక్రవారమే బొత్స తిరిగి సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా

ఆయనను మంత్రి లోకేశ్ ఆత్మీయంగా పలకరించారు. 'బొత్స సత్యనారాయణ గారు నమస్కారం' అంటూ పలకరించారు. బొత్స సత్యనారాయణ వినకపోవడంతో వెంటనే కల్పించుకున్న చైర్మన్.. 'మంత్రి నారా లోకేశ్ మిమ్మల్ని పరామర్శిస్తున్నారు' అంటూ బొత్సకు తెలియజేశారు. వెంటనే మంత్రి మాట్లాడుతూ.. 'గురువుగారు చిన్న అనారోగ్య సమస్యతో బాధపడ్డారు. ఆయన తిరిగి ఆరోగ్యంగా హౌస్‌కు రావడం ఆనందంగా ఉంది' అని మంత్రి లోకేశ్ అన్నారు. ఇటీవల మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

# ఆహ్లాదకరంగా ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం..





విజయవాడ**మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

విజయవాడలో జరిగిన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. రాజకీయాలకు కాస్త విరామమిచ్చి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకలో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ ఆలపించిన ప్రార్థనా గీతం అందరినీ ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నేతలంతా ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనందంగా సమయం గడిపారు. ముఖ్యంగా ఈ వేడుకలో మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అక్కడికి వచ్చిన ప్రజాప్రతినిధుల పిల్లలతో ఆయన సరదాగా ఆటలు ఆడుతూ సందడి చేశారు. అలాగే, ఇటీవల 'ఆటవిడుపు' పేరుతో ప్రజాప్రతినిధులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజయం సాధించిన విజేతలకు ఈ వేదికపై బహుమతులను అందజేశారు. కుటుంబాల కలయికతో సాగిన ఈ కార్యక్రమం నేతల మధ్య స్నేహభావాన్ని మరింత బలోపేతం చేసింది.
ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో, శాసనసభ్యులు మరియు వారి కుటుంబాల కోసం మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. ఈ విందు ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.



# ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయండి





## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, బ్యూరో మార్చి 06 (రిపబ్లిక్ న్యూస్):**
9వ తేదీన డోన్ మండలం కొత్త బురుజు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన జరగనున్న నేపథ్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను సమగ్రంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం డోన్ పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా స్థాయి అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా కొత్త బురుజు గ్రామానికి వెళ్లే గ్రామాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారుల వెంట చెత్త కుప్పలు, ప్లాస్టిక్ కవర్లు, మద్యం సీసాలు కనిపిస్తున్నాయని పేర్కొంటూ వాటిని తక్షణమే తొలగించి శుభ్రతను కాపాడాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆకస్మికంగా సందర్శించే అవకాశం ఉన్నందున కొత్త బురుజు గ్రామం పూర్తిగా శుభ్రంగా, సక్రమంగా ఉండేలా చూడాలని తెలిపారు. మున్సిపల్ విభాగం వద్ద తగిన సంఖ్యలో సిబ్బంది ఉన్నందున పరిశుభ్రత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే కమ్యూనికేషన్ సదుపాయాల కోసం బీఎస్ఎన్ఎల్ ద్వారా 26 కిలోమీటర్ల లైన్ ఏర్పాటు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని బిఎస్ఎన్ఎల్ అధికారులను సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాలుగు ప్రదేశాల్లో కూల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి క్యాంపులో తాగునీరు, ఆర్వో వాటర్, ప్లాస్టిక్ గ్లాసులు, డస్ట్ బిన్ లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లా ప్రత్యేకతలను ప్రతిబింబించే విధంగా ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డోన్ ప్రాంతం మైనింగ్, హార్టికల్చర్ మరియు నీటి కొరత ప్రాంతంగా గుర్తింపు పొందినందున మొదటి స్టాల్ లో ఈ అంశాలను ప్రధానంగా ప్రదర్శించాలని తెలిపారు. హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో అరటి సాగు సహా ఇతర ప్రధాన పంటల వివరాలను కూడా ప్రదర్శించాలన్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా బెలుం గుహలు మరియు వాల్మీకి గుహల గురించి వివరాలు, వీడియో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. మొదటి స్టాల్‌ను జిల్లా మరియు డోన్ ప్రాంత ప్రత్యేకతలపై, రెండవ స్టాల్‌ను వెంగలంపల్లె గ్రామ అభివృద్ధిపై, మూడవ స్టాల్‌ను సాసా కార్యక్రమంపై, నాలుగవ స్టాల్‌ను పి4 బంగారు కుటుంబం పథకంపై ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి స్టాల్ వద్ద వివరణ ఇచ్చేందుకు ఇద్దరు లేదా ముగ్గురు అధికారులను మాత్రమే నియమించి, వారి పేర్లను ముందుగానే ఎస్పీకి సమర్పించాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్యాహ్నం పొలాన్ని సందర్శించే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆ సమయంలో విఆర్ఓ, పంచాయతీ కార్యదర్శి, విలేజ్ సర్వేయర్ మరియు వ్యవసాయ సహాయకుడు మాత్రమే అక్కడ ఉండాలని తెలిపారు. రైతులకు సంబంధించిన వివరాలను క్యూ ఆర్ కోడ్ ద్వారా అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఎండ తీవ్రత కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున నాలుగు అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని, కాన్వాయ్ లో కూడా రెండు అంబులెన్సులు ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ భద్రతా ఏర్పాట్లలో విద్యుత్ తీగలు, వైరింగ్ వంటి అంశాలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోడ్ ను దృష్టిలో ఉంచుకుని తగిన విధంగా విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే పార్కింగ్ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, కాన్వాయ్ కు మంచి స్థితిలో ఉన్న వాహనాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలను చేపట్టాలని ఆర్టీఓ సహా సంబంధిత అధికారులకు సూచించారు.

# అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**శాఖల సమన్వయంతో అక్రమ తవ్వకాలను అరికట్టాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 6)** జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మైనింగ్‌కు సంబంధించిన అనుమతులను నిబంధనల ప్రకారం మాత్రమే మంజూరు చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖకు సంబంధించిన అంశాలపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెవెన్యూ, మైనింగ్, అటవీ, పోలీస్ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహజ వనరులను సంరక్షించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అక్రమంగా మైనింగ్ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లయితే వెంటనే గుర్తించి అడ్డుకోవాలని అధికారులకు సూచించారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టడంలో రెవెన్యూ, మైనింగ్, అటవీ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అలాగే మైనింగ్ అనుమతుల మంజూరు ప్రక్రియలో పారదర్శకత, వేగం ఉండాలని, నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారికి మాత్రమే అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ జి. వెంకటేశ్వర్లు, అటవీ శాఖ అధికారి తేజస్వీ, తహశీల్దార్ వెంకట లక్ష్మి, ఉసేన్ సాహెబ్ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణకు జిల్లాలో (హెచ్ పివి) వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభం

**1415 ఏళ్ల బాలికలకు ఉచితంగా 'గార్డాసిల్4' టీకా జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 6)**ప్రాణాంతకమైన సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించడమే లక్ష్యంగా జిల్లాలో హెచ్ పివి (హ్యూమన్ పాపిల్లోమావైరస్) వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో హెచ్ పివి వ్యాక్సిన్ క్యాంపెయిన్‌కు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు ముందస్తు చర్యగా హెచ్ పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. 14 ఏళ్లు నిండి 15వ ఏట అడుగుపెట్టే బాలికలకు ఈ వ్యాక్సిన్ అందించనున్నట్లు తెలిపారు. 'గార్డాసిల్4' టీకాను 0.5 మిల్లీలీటర్ల మోతాదులో ఎడమ చేతికి వేస్తారని వివరించారు. వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డు మరియు తల్లిదండ్రుల సమ్మతి పత్రం (కన్సెంట్ లెటర్) తప్పనిసరి అని చెప్పారు.
టీకా తీసుకునే వారు 'యు-విన్'పోర్టల్ లేదా స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. టీకా వేయించుకునే వారు ముందుగా ఆహారం తీసుకుని రావాలని, టీకా అనంతరం 30 నిమిషాల పాటు ఆరోగ్య కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్ సీ) ఈ వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.
జిల్లాలో మొత్తం 19,704 మంది బాలికలను లక్ష్యంగా పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, సుమారు మూడు నెలల పాటు ఈ వ్యాక్సినేషన్ క్యాంపెయిన్ కొనసాగుతుందని కలెక్టర్ వివరించారు.
ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డా. భాస్కర్ రాజు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. చిట్టి నరసమ్మ, డీసీహెచ్ఎస్ డా. జాఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

## కర్నూలుఎంపీ బస్తిపాటి నాగరాజు







**కర్నూలు ప్రతినిధి, మార్చి 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
తల్లిదండ్రులు పడే కష్టాలను గుర్తించి, విద్యార్థులు కష్టపడి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. శుక్రవారం రోజున నగరంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఎంపీ నిధులతో మంజూరైన కళాశాల బస్సును జిల్లా కలెక్టర్ డాక్టర్.సిరి తో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎంపీ నాగరాజు మాట్లాడుతూ తాను ఎంపీగా గెలిచిన తర్వాత, సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్, సిబ్బంది వచ్చి గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే నర్సింగ్ విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఒక బస్సు కావాలని అడగడం జరిగిందన్నారు. ఆ రోజు ఇచ్చిన హామీలో భాగంగా ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద బస్సును మంజూరు చేసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల నుండి ఎంతో మంది విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారు కాబట్టి, ప్రతి ఒక్కరూ ఈ బస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్, లెక్చరర్ల ఇచ్చే సలహాలను పాటిస్తూ చదువును నిర్లక్ష్యం చేయకుండా బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కర్నూలు మెడికల్ కళాశాలకు కూడా బస్సు కావాలని కోరడం జరిగిందని, వచ్చే బడ్జెట్‌లో మెడికల్ కాలేజీకి తప్పకుండా నిధులు కేటాయించి బస్సు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో ఈ కాలేజీకి ఏ అవసరం ఉన్నా తన వంతు సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ డా.చంద్రశేఖర్, సిపిఓ భారతి, డిఎంహెచ్ఓ డా.భాస్కర్, జి జి హెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు

# అధిక పొల్యూషన్ తో ఆసుపత్రుల పాలవుతున్న ప్రజలు

## నిబంధనలకు తిలోధకాలు.







**ఓబులవారిపల్లి మార్చి 6 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లె మండలం కడప చెన్నయ్ జాతీయ రహదారి మంగంపేట ఏపీఎండిసి గనుల నుండి ముగ్గు రాయి ఖనిజం ప్రతిరోజు వేల టన్నులుయంప్రదా, వర్షిని పలు కంపెనీలకు రవాణా చేస్తుంటారు ఈ క్రమంలో గనుల నుండి ట్రక్కులు ఖనిజాన్ని తరలించే క్రమంలో జాతీయ రహదారి నుండి గోవిందం పల్లె కనెక్టివిటీ రోడ్డు వెలుతుంటాయి ఈ క్రమంలో దుమ్ము విపరీతముగా లేవడం వల్ల ఈ రహదారిలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు వాహనదారులు విద్యార్థులు వృద్ధులు అననిత్యం సంచరిస్తూ ప్రయాణిస్తూ ఉంటారు ఈ అధిక పొల్యూషన్ వల్ల విద్యార్థులు వృద్ధులు పలు రకాల వ్యాధులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వృద్ధులు ఈ దుమ్ము పిల్చడం వల్ల తొందరగా అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలై తిరుపతి మెరుగైన వైద్యం కోసం వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు ఈ విషయమై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైల్వే కోడూరు కార్యదర్శి చెన్నయ్య మండల కార్యదర్శి నాగమ్మ ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా నిర్వహించడం జరిగినది పొల్యూషన్ కంట్రోల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల దుమ్ము ధూళి సోకి ఊపిరితిత్తుల వ్యాధులు చర్మవ్యాధులు దగ్గు జలుబు వంటి ప్రమాదకరమైన వ్యాధులు చూపుతున్నాయని ఈ విషయంలో అధికారులు చొరవ చూపాలన్నారు
పొల్యూషన్ కంట్రోల్ అధికారులకు ప్రజల ప్రాణాలు పట్టవా??
మామూళ్ళ మత్తులో పొల్యూషన్ అధికారులు జరుగుతున్న తంతు ను చోధ్యం గ చూస్తున్నారని ఆరోపిస్తున్నారు,
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ
మార్చి 6వ తేదీన మండల పరిధిలోని ఏపీఎండిసి మంగపేట ఆవరణంలో ఉన్న.గోవిందం పల్లి పంచాయతీ బొమ్మ వారం క్రాస్ రోడ్డు హైవే రోడ్డు పై దుమ్ము, దూళితో వస్తున్న కాలుష్యం అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలి అని మండల పార్టీ కార్యదర్శి చింతలపూడి నాగమ్మ ఆధ్వర్యంలో చీపిరి కట్టలతో రోడ్డు మీద దుమ్ము తోస్తూ రాస్తారోకో చేయడం జరిగింది
ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ
గోవిందం పల్లి పంచాయతీలో చెన్నకేశవస్వామి దేవాలయం దగ్గర మంగళంపల్లి క్రాస్ రోడ్డు నుండి. బొమ్మవరం క్రాస్ రోడ్డు నుండి. కట్ట పుట్టాలమ్మ దేవాలయం వరకు దుమ్ము. ధూళి ఎక్కువ కావడంతో ఎక్కువ యాక్సిడెంట్లు జరిగి ప్రజల ప్రాణాలు గాల్లో కలసి పోతున్నాయి, అలాగే గోవిందం పల్లి గ్రామప్రజలు దుమ్ము. ధూళి వలన అలర్జీలు, టీబీ, ఊపిరితిత్తుల వ్యాదులతో, మరియు కొత్త కొత్త జబ్బులు వస్తూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోగా ఇంకా చాలా మంది హాస్పిటల్ పాలై లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకుంటూ అప్పులు బాధలతో తట్టుకోలేక నానా ఇబ్బందులు పడుతున్న కూడా ఏ ఒక్క అధికారి కూడా పొల్యూషన్ నుండి గ్రామ ప్రజలను పట్టించుకున్నటువంటి పాపాన పోలేదని అన్నారు.
ఈ ప్రాణాలు పోవడానికి కారణం కేవలం ఏపీఎండీసీ సంస్థ నుండి ముగ్గురాయి ని డిస్పాచ్ చేస్తున్న లారీ లు ఈ టిప్పర్స్ అన్నియు ఒక్క రోజుకు వేల తిప్పర్స్ ఈ రహదారిలో తిరిగిన కారణంగా విపరీతమైన దుమ్ము, దూళి తో గాలి కాలుష్యం అవుతుంది ముఖ్యంగా ఈ గ్రామాల మధ్యలో ఉన్న
యంప్రదా కంపెనీ కి ఒక్కరోజుకు సుమారు ఏపీఎండిసి నుండి వారి కంపెనీకి సుమారు 5000 మెట్రిక్ టన్నులు.బేరైటీస్ రాయి డిస్పాచ్ అవుతున్నది, అలాగే జింపెక్స్.రాందాస్. మరియు చిన్న చిన్న కంపెనీల వారికి 5000 మెట్రిక్ టన్నులు ఒక్క రోజు డిస్పాచ్ అవుతుంది అంటే మొత్తం ప్రతిరోజు 10,000 మెట్రిక్ టన్నులు ఏపీఎండిసి నుండి హైవే రోడ్డు మీదుగా పల్లెల్లోకి దాదాపు 200 టిప్పర్లతో రవాణా చేస్తున్నారు,ఒక్క టిప్పర్ 18 టన్నులు తీసుకుని వెళ్తుంది అంటే ఎన్ని సార్లు 200 టిప్పర్లు తిరిగితే ఒక్క రోజుకు 10 వేల టన్నులు డిస్పాచ్ జరుగుతుంది ఆలోచించాలి, ఇవే కాకుండా పక్క రాష్ట్రాలకు పోయే ట్రాలీలు దాదాపు 100 మొత్తం 300 వరకు వాహనాలు ప్రతిరోజు తిరుగుతూ ఉంటాయి కనీసం ఈ కంపెనీల వారు ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా కనీసం వాటర్ రోడ్డుమీద కొట్టకుండా రవాణా చేయటం వలన దుమ్ము. ధూళి ఎక్కువ కమ్ముకోవడంతో ఈ యాక్సిడెంట్లు జరుగుతున్నాయి అన్నారు. గ్రామ ప్రజలకు దుమ్ము.ధూళి వలన జబ్బులు వచ్చి హాస్పిటల్ లో లక్షలు ఖర్చు పెట్టుకుంటున్నారు ఈ విషయాలను ఏ ఒక్క అధికారులు కూడా పట్టించుకోని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. పొల్యూషన్ కి సంబంధించినటువంటి అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా ఆయా కంపెనీల కాడ ముడుపులు తీసుకుని పోతూ ప్రజలను పట్టించుకోకుండా ఉండడం వలన ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఇప్పటికైనా ఏపీఎండిసి యాజమాన్యం అయినా. పొల్యూషన్ అధికారులైన అయినా దీనిపై స్పందించి ప్రజలను జబ్బుల నుండి కాపాడి. వాహనదారులను యాక్సిడెంట్లో నుండి కాపాడవలసినదిగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐగా మేము కొన్ని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారిని. పొల్యూషన్ వారిని. ఏపీ ఎండిసి యాజమాన్యాన్ని కోరుచున్నాము. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలను కలుపుకొని ప్రజాసంఘాల వారిని కలుపుకొని గ్రామ ప్రజలకు. వాహనదారులకు న్యాయం జరిగేంత వరకు జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని పై అధికారులకు హెచ్చరిక చేస్తున్నాము అని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు కార్యక్రమంలో పాల్గొన్న వారు ఏపీఎండిసి ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ పోకూరు మురళి. రైల్వే కోడూరు పార్టీ కార్యదర్శి దార్ల రాజశేఖర్. పుల్లంపేట మండల కార్యదర్శి ఆర్ చల్వన్ కుమార్. బి కే యం యు కోడూరు నియోజకవర్గ కార్యదర్శి ఎం జయరామయ్య. డి హెచ్ పి ఎస్ కోడూరు ఏరియా కార్యదర్శి ఎం శివయ్య. డి హెచ్ ఎస్ జిల్లా నాయకులు డి నాగేశ్వరరావు. కే గోపాల్. ఎం రోజమ్మ. ఎం వెంకటరమణ. సుబ్రహ్మణ్యం. ఏఐవైఎఫ్ కోడూరు నియోజకవర్గం కార్యదర్శి నరసయ్య పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com